ప్రజాశక్తి

సోమవారం 24 జూన్ 2024 | 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

గుంటూరు కౌన్సిల్‌పై టిడిపి దృష్టి

మేయర్, కార్పొరేటర్లు లేకుండానే సమీక్ష - పట్టు సాధించేందుకు నేతలు ప్రయత్నం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు నగర పాలక సంస్థపై టిడిపి దృష్టి సారించింది. మేయర్, కార్పొరేటర్లతో సంబంధం లేకుండా గుంటూరు సమస్యలపై కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ నగర పరిధిలోని ఎమ్మెల్యేలతో కలిసి ఆదివారం సమీక్షించారు. ఈ సమీక్షకు మేయర్, ఇతర కార్పొరేటర్లను ఆహ్వానించలేదు. కార్పొరేషన్ సమస్యలపై కలెక్టరేట్‌లో సమీక్ష ఏర్పాటు చేశారు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఎవ్వరూ హాజరు కాలేదు. నగరపాలక సంస్థ కమిషనర్, పబ్లిక్ హెల్త్ ఎస్ఇ, ఇతర అధికారులు మాత్రమే హాజరయ్యారు. కొంత కాలంగా నెలకొన్న తాగునీరు, డ్రెయినేజి, రహదారుల నిర్మాణంపై సమీక్షలో చర్చించారు.

అసంపూర్తిగా నిలిచిపోయిన భూగర్భ డ్రెయినేజి పనులపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. దీంతో ఈ పనులు తిరిగి ప్రారంభం అవుతాయా లేదా అన్న అంశం సందిగ్ధంగా మారింది. మిగతా పనులపై సాధారణ సమీక్ష చేశారు. మరోవైపు ఎన్నికల ఫలితాల తరువాత మేయర్ కావటి మనోహర్ నాయుడు కూడా కార్పొరేషన్ కార్యాలయానికి ఒకటి రెండుసార్లు మాత్రమే వచ్చారు. మిగతా సమయంలో క్యాంపు కార్యాలయానికి పరిమితం అవుతున్నారు. గుంటూరు నగర



పాలక సంస్థ సర్వసభ్య సమావేశం జరిగి 100 రోజులు పూర్తయింది. ప్రభుత్వ నిబంధనలు ప్రకారం 90 రోజుల్లో కౌన్సిల్ సాధారణ సమావేశం జరగాల్సి ఉంది. మార్చి 11న కౌన్సిల్ బడ్జెట్ సమావేశం జరిగింది. మార్చి 16న ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. మేయర్ కావటి మనోహర్ నాయుడు చిలకలూరిపేట నుంచి వైసిపి తరుపున పోటీ చేశారు. ఎన్నికల్లో ఓటమి తరువాత ఆయన ప్రజల్లోకి రావడం లేదు. కౌన్సిల్ సమావేశం ఏర్పాటునకు కూడా మేయర్ ఇంత వరకు అధికారులతో చర్చించలేదు.

ఈ నేపథ్యంలో టిడిపి కార్పొరేషన్‌పై పట్టు సాధించే దిశగా అడుగులు వేస్తోంది. గత మూడున్నరేళ్లలో జరిగిన అక్రమాలపై విచారణ చేయించి మేయర్‌ను బలవంతంగా సీటును తప్పించాలని యోచిస్తున్నారని తెలిసింది. గుంటూరు కార్పొరేషన్‌లో 8 మంది వైసిపి కార్పొరేటర్లు ఇప్పటికే టిడిపిలో చేరారు. 57 మంది కార్పొరేటర్లు ఉండగా వారిలో 9 మంది టిడిపి వారున్నారు. ఇటీవల 8 వైసిపి కార్పొరేటర్లు టిడిపిలో చేరారు. దీంతో టిడిపి బలం 17కి పెరిగింది. మరో 10 మందిని సమీకరిస్తే మేయర్ కావటి మనోహర్ నాయుడ్ని పదవి నుంచి తొలగించాలని టిడిపి నగర నాయకులు యోచిస్తున్నారు. ఎక్స్‌అఫిషియో మెంబర్లుగా ఉన్న ఎంపి, ఎమ్మెల్యేలు టిడిపి నుంచి ఎన్నిక కావడంతో టిడిపి బలం ఇప్పటికే భారీగా పెరిగింది. మరో 10 మంది కార్పొరేటర్లు టిడిపిలోకి వస్తే మేయర్ పదవి నుంచి తప్పుకోవాల్సి ఉంటుంది.

చట్టపరంగా కౌన్సిల్ ఏర్పడిన రోజునుంచి నాలుగేళ్ల తరువాత మాత్రమే మేయర్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టాల్సి వుంటుంది. 2021 మార్చి 18న నూతన కౌన్సిల్ కొలువుదీరింది. దీంతో అవిశ్వాసం కోసం మరో ఏడు నెలలు వేచి ఉండాలి. లేదంటే ఏదో ఒక ఆరోపణలుచేసి బలవంతంగా రాజీనామా చేయించాల్సి ఉంటుందని టిడిపి వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ అంశంపై సిఎం చంద్రబాబు నాయుడు స్థాయిలో నిర్ణయం తీసుకోవాల్సి ఉందని సీనియర్ నేతలు చెబుతున్నారు. అయితే ముందస్తుగా కార్పొరేషన్ పట్టు సాధించేందుకు టిడిపి కార్పొరేటర్లు పావులు కదుపుతున్నారు.



మంత్రి మనోహర్‌కు సమస్యలు చెబుతున్న బాధిత రైతులు, నాయకులు

మంత్రి వద్దకు బాధిత పసుపు రైతులు

- కోల్డ్ స్టోరేజీ అగ్ని ప్రమాద ఘటనలో పరిహారం కోసం వినతి
- మంత్రి లోకేష్‌తో మాట్లాడతామన్న నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి-తెనాలిరూరల్

దుగ్గిరాల శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్ అగ్నిప్రమాద బాధిత పసుపు రైతులకు న్యాయం చేయాలని కోరుతూ ఎపి పసుపు రైతుల సంఘం ఆదివారం రాష్ట్ర ఆహార పౌర సరఫ రాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు వినతి పత్రాన్ని ఇచ్చారు. స్థానిక జనసేన కార్యాలయంలో మంత్రిని కలిసిన రైతు నాయకులు పసుపు రైతుల వ్యధను మంత్రికి వివరించారు. పసుపు రైతుల సంఘం రాష్ట్ర కమిటి సభ్యులు ఎం.శివసాంబిరెడ్డి మాట్లా డుతూ రైతులు భద్రపరచుకున్న పసుపు దగ్ధమై ఐదు నెలలు గడుస్తున్నా సమస్య పరిష్కారం కాలేదన్నారు. ప్రభుత్వం జోక్యం ▶ 2లో

26న నూతన కలెక్టర్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి : జిల్లా నూతన కలెక్టర్‌గా నియమితులైన ఎస్.నాగలక్ష్మి బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. సోమవారం ఆమె విజయనగరంలో రిలీవ్ అయిన తర్వాత బుధవారం గుంటూరు వచ్చి బాధ్యతలు స్వీకరిస్తారు. బదిలీ అయిన జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి ఆదివారం తన బాధ్యతల నుంచి రిలీవ్ అయ్యారు. జాయింట్ కలెక్టర్ రాజకుమారికి బాధ్యతలు అప్పగించారు. నూతన కలెక్టర్ నాగలక్ష్మి బాధ్యతలు స్వీకరించే వరకు జాయింట్ కలెక్టరు ఇన్‌ఛార్జి కలెక్టరుగా వ్యవహరిస్తారు.



అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి చంద్రశేఖర్, ఇతర ఎమ్మెల్యేలు

వైసిపి కార్పొరేటర్లతో చర్చిస్తాం

- కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్
- తాగునీరు, డ్రెయినేజి, డయేరియా, రోడ్ల విస్తరణపై సమీక్ష
- అభివృద్ధిపై మున్సిపల్ కమిషనర్, అధికారులకు సూచనలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు కార్పొరేషన్‌లో వైసిపికి చెందిన మేయర్ ఆధ్వర్యంలో కౌన్సిల్ కొనసాగుతున్నందున వారితోకూడా చర్చించి నగర అభివృద్ధిపై ప్రణాళిక రూపొందిస్తామని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చెప్పారు. గుంటూరు కలెక్టరేట్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రస్తుత కౌన్సిల్‌ను గౌరవించాలని అభివృద్ధికి వారు కూడా సహకరించాలని కోరారు. కార్పొరేషన్‌లో నిధుల్లేక, రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధుల ▶ 2లో

నీరొచ్చే వేళ.. కాల్వలు ఇలా..

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పొలాలకు నీరందించాల్సిన ప్రధాన కాల్వలు ఖరీఫ్ ఆరంభమైనా విస్మరణకు గురవుతున్నాయి. ఈ సందర్భంలో సాగునీరు విడుదల చేసినా అవి సరిగా పారండం, పొలాకు చేరడం కష్టసాధ్యంగానే కనిపిస్తోంది. దట్టంగా పెరిగిన గడ్డి, చెట్లు, విరిగిపడిన కొమ్మలు, పూడికలతో కాల్వలు అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. వీటిని ఇంతే ఉంచి తాగు అవసరాలకు నీరు విడుదల చేస్తే అవికూడా కలుషితమై రోగాల పాలవుతామని జనం ఆందోళనకు గురవుతున్నారు. నాగార్జున సాగర్ కుడి కాల్వ పరిధిలో నీటిపై ఆధారపడి ఉమ్మడి గుంటూరు జిల్లాతో పాటు ప్రకాశం జిల్లాలో కొంత వరకు కలిపి మొత్తం 11.50 లక్షల ఎకరాలకు సాగు భూమి ఉంది. ప్రధాన మేజరు కాల్వ ద్వారా 11.50 లక్షల ఎకరాల సాగు భూమితో పాటు ఎన్నో గ్రామాలకు తాగు నీరు సరఫరా ఈ కాల్వల ద్వారానే అందాల్సి ఉంది. ఆయా గ్రామాల్లో సమగ్ర రక్షితనీటి ప్రాజెక్టుల్లోని సమ్మర్ స్టోరేజీ ట్యాంకులకు కూడా ఇదే నీరు సరఫరా కావల్సి ఉంది. ఏడాది లేదా రెండేళ్లకోసారి ఈ



చెట్లతో పూడుకుపోయిన అన్నవరం మేజర్ కాల్వ

కాల్వలను మరమ్మతులు చేయాల్సి ఉన్నా ఐదేళ్లుగా ఆ పనులే విస్మరణకు గురయ్యాయి. అయితే తామిప్పటికే ప్రణాళికలు సిద్ధం చేశామని, ప్రభుత్వం నుండి అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తామని ఎన్ఎస్‌పి ఎస్ఇ డి.వరలక్ష్మి చెప్పారు. పంట కాల్వలు, బోదే కాల్వలను ఉపాధి హామీ పనుల కింద





బాగుచేయించామని, మేజర్ కాల్వల మరమ్మతులూ చేపట్టి రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తామని అన్నారు.



అమరావతిని సాంస్కృతిక రాజధానిగా తీర్చిదిద్దాలి

ప్రజాశక్తి-గుంటూరు

నూతన ప్రభుత్వం నవ్యాంధ్ర రాజధాని అమరావతిని సాంస్కృతిక రాజధానిగా కూడా తీర్చిదిద్దాలని నూతన ప్రభుత్వానికి ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు సూచించారు. స్థానిక బ్రాడీపేటలోని యుటిఎఫ్ హాల్లో ఊరూరా జనవిజ్ఞానం ఆలిండియా ఘంటసాల చైతన్య వేదిక ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి ఊరూరా జన విజ్ఞానం రాష్ట్ర అధ్యక్షులు కోట వెంకటేశ్వరరెడ్డి అధ్యక్షత వహించి మాట్లాడారు. నవ్యాంధ్ర రాజధాని అమరావతిలో అమర గాయకులు ఘంటసాల 25 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, నటరత్న ఎన్టీఆర్, పద్మశ్రీ ఘంటసాలకు భారతరత్న ప్రకటించాలని, హైదరాబాద్ వలె ట్యాంక్‌బండ్ ఏర్పాటుచేసి కృష్ణా నదికి రెండు వైపులా ప్రముఖ రచయితలు, కళాకారులు విగ్రహాలను ఏర్పాటు చేసి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆసోది శంకర్, డోల శరత్ కుమార్, ఆతిన శ్రీనివాసరావు, పి.ఫణి, అంజిరెడ్డి పాల్గొన్నారు.



హేమచంద్రారెడ్డిపై విచారణ చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు : ఉన్నత విద్యా మండలి చైర్మన్ హేమచంద్రారెడ్డిపై క్రిమినల్ కేసు నమోదు చేసి, తక్షణమే అరెస్టు చేయాలని నవ్యాంధ్ర విద్యార్థి యువజన జెఎసి రాష్ట్ర అధ్యక్షులు అయ్యస్వామి కోరారు. ఆదివారం అరండల్‌పేటలోని నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో ఐదేళ్లలో రూ.200 కోట్ల అవినీతికి పాల్పడిన ఉన్నత విద్యా మండలి చైర్మన్ హేమచంద్రారెడ్డిపై తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని కోరారు. విశ్వవిద్యాలయాల్లో తన బినామీలను పెట్టుకుని అక్రమ సంపాదన ధ్యేయంగా, ప్రైవేట్ కాలేజీల యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చి భయభ్రాంతులకు గురిచేస్తూ కోట్లాది రూపాయలు వసూలు చేస్తూ ఉన్నత విద్యా వ్యవస్థను నాశనం చేశారని ఆరోపించారు. ఉన్నత విద్యా మండలిలో ఎంఒయుల పేరుతో పేద విద్యార్థుల ఫీజులను రూ.200 కోట్లు దోచుకుని బెంగళూరు, హైదరాబాద్, చెన్నై, విజయవాడ, కర్నూల్, అనంతపురం, గుంటూరు, వైజాగ్ నగరాల్లో కోట్ల రూపాయల అక్రమ ఆస్తులు కూడపెట్టారని ఆరోపించారు. కావున తక్షణమే అతనిపై సుప్రీమ్ కోర్టు సిట్టింగ్ జడ్జి చే విచారణ జరిపించి అతనిపై క్రిమినల్ కేసు నమోదు చేసి అరెస్టు చేసే విధంగా కృషి చేయాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో రాయలసీమ విద్యార్థి యువజన సంఘాల జేఏసీ చైర్మన్ బి.శ్రీరాములు, గిరిజన విద్యార్థి సేన రాష్ట్ర అధ్యక్షులు పాండు నాయక్ పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల బరువు తగ్గించాలి

ప్రజాశక్తి - గుంటూరు : ప్రైవేటు కార్పొరేట్ విద్యాసంస్థల ఒత్తిడితో కూడిన విద్యాబోధనతో విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారని, కిలోల బరువైన పుస్తకాలు మోస్తూ అనారోగ్యం పాలవుతున్నారని అవగాహన సంస్థ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు సంస్థ కార్యదర్శి కె.శివరామిరెడ్డి ఆదివారం ఒక ప్రకటన జారీ చేశారు. బండెడు పుస్తకాల బరువుతో పిల్లల ఎదుగుదల, ఆరోగ్యంపై ప్రభావం ఉంటున్నట్లు వైద్యులు చెబుతున్నా విద్యాసంస్థలు పట్టించుకోవడం లేదేఇ, ప్రభుత్వం అసలు ఈ సమస్యపై దృష్టి సారించడం లేదని విమర్శించారు. సాంకేతిక అభివృద్ధి చెందుతున్నా విద్యావిధానంలో మార్పు కానరావడం లేదని, పైగా తల్లిదండ్రులను భారీగా పుస్తకాలు కొనుగోలు చేయిస్తున్నారని పేర్కొన్నారు. ఈ పరిస్థితి మారాలన్నారు.

మంత్రి వద్దకు బాధిత పసుపు రైతులు

(మొదటి పేజీ తరువాయి)

చేసుకొని పసుపు రైతులకు న్యాయం చేయాలని కోరారు. గద్దె శ్రీహరి మాట్లాడుతూ తెనాలి సబ్ కలెక్టర్ స్పందించినట్లు క్రింది స్థాయి ప్రభుత్వ అధికారులు స్పందించడం లేదని చెప్పారు. ఆర్ఆర్ యాక్ట్ ప్రకారం కోల్డ్ స్టోరేజి యజమాని ఆస్తులను స్వాధీన పరుచుకోవాలని కోరారు. మంత్రి స్పందిస్తూ పసుపు రైతుల సమస్యను మంగళగిరి ఎమ్మెల్యేగా ఉన్న ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. రైతులు ఆందోళన చెందకుండా ప్రభుత్వం నుంచి వచ్చిన బీమాను తీసుకోవాలని సూచించారు. మంత్రికి వినతిపత్రం ఇచ్చిన వారిలో బాధిత పసుపు రైతుల సంఘం కన్వీనర్ వేములపల్లి వెంకటరామయ్య, పి.రవి కిషోర్, లంకిరెడ్డి నాగేశ్వరరెడ్డి, నాదెళ్ల చంద్రశేఖర్, సుబ్బారావు, ప్రసాదరావు, సురేంద్ర, రామిరెడ్డి ఉన్నారు.

సమిష్టిగా ఉండి పరిష్కరించుకుందాం

ప్రజాశక్తి - దుగ్గిరాల

కోల్డ్ స్టోరేజీ అగ్ని ప్రమాదం ఘటనకు సంబంధించి అందరం సమిష్టిగా ఉంటూ ప్రజాప్రతినిధులతో కలిసి సమస్యలను పరిష్కరించుకుందామని బాధిత రైతులు అభిప్రాయ పడ్డారు. దుగ్గిరాలలోని శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్ అగ్ని ప్రమాదంలో నష్టపోయిన బాధిత పసుపు రైతుల సమావేశం స్థానిక టర్మరిక్ అసోసియేషన్ హాలులో ఆదివారం నిర్వహించారు. పసుపు రైతు బాధితుల కమిటీ కన్వీనర్ వేములపల్లి వెంకటరామయ్య ఈ సమావేశాని అధ్యక్షత వహించారు. కమిటీ అధ్యక్షులు జొన్న శివశంకర్ మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం ఏర్పడినందున వెంటనే పనులు జరుగుతాయని ఆశించవద్దని చెప్పారు. అందరూ కలిసి మంత్రులు, అధికారుల వద్దకు వెళ్లి సమస్యను విన్నవించి పరిష్కరించుకుందామని చెప్పారు. వారి స్పందన, చర్యల ఆధారంగా తదనంతర కార్యాచరణపై చర్చించి నిర్ణయం తీసుకుందామన్నారు. బీమా కంపెనీ నుండి క్వింటాళ్‌కు రూ.4200 చొప్పున నష్టపరిహారం వస్తాయంటున్నారని, అది ఏమాత్రమూ ఆమోదయోగ్య కాదని, ప్రభుత్వం స్పందించి రూ.12500 చెల్లించాలని కోరారు. వెంకటరామయ్య మాట్లాడుతూ ఎన్నో కష్టనష్టాలకోర్చి రైతులు పంట పండించారని, ధర పెరిగాక అమ్ముకుందామనే ఉద్దేశంతో కోల్డ్ స్టోరేజ్‌లో నిల్వ చేసుకున్నారని గుర్తు చేశారు. ధరలు పెరిగేనాటికి పంట మంటల్లో బూడిదైందని, బీమా కంపెనీ నుండి గాని యజమాని నుండి గాని, ప్రభుత్వం నుండి గాని ఎటువంటి స్పందనా లేదని విమర్శించారు. ప్రభుత్వ యంత్రాంగం తక్షణమే స్పందించి రైతులకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. రైతు సంఘం నాయకులు ఎం.శివసాంబిరెడ్డి మాట్లాడుతూ పసుపు రైతులను ఆదుకోకుంటే భవిష్యత్తులో ఎవరూ పసుపు పంట సాగు చేసే పరిస్థితి ఉండదన్నారు. సోమవారం కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం ఇస్తామని చెప్పారు. సమావేశంలో నాయకులు జె.బాలరాజు, ఎస్.యోగేశ్వరరావు, బి.అమ్మిరెడ్డి, అద్దంకి పాములు, రైతులు నాదెండ్ల చంద్రశేఖర్, గద్దె శ్రీహరి, కిషోర్, వెంకటప్పరెడ్డి, శ్రీకాంత్, పడుచూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇదిలా ఉండగా ఈ ఏడాది జనవరి 19న స్థానిక శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో 381 మందికి చెందిన సుమారు 90 వేల బస్తాల పసుపు అగ్నికి ఆహుతైంది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన విచారణ కమిటీ అప్పటి ధర ప్రకారం క్వింటాళ్‌కు రూ.12,500 నష్టపరిహారం చెల్లించవచ్చునని సిఫార్సు చేసింది. ప్రస్తుతం క్వింటాళ్ రూ.14 వేలు పతుకుతోంది. కోల్డ్ స్టోరేజ్ యజమాని క్వింటాళ్‌కు రూ.4200కు బీమా చేశారు. బీమా కంపెనీ అంతే మొత్తంలో డబ్బులిస్తే తాము నష్టపోకుండా మిగిలిన రూ.8300ను యజమాని గాని ప్రభుత్వం గాని కలిపి ఇవ్వాలని బాధిత రైతులు కోరుతున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జొన్న శివశంకరరావు, హాజరైన బాధిత రైతులు

వివిధ శాఖలపై అధికారులతో మంత్రి సమీక్ష

ప్రజాశక్తి - తెనాలి



సీజనల్ వ్యాధులు సోకకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని, డయేరియా కేసులు నమోదు కాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను రాష్ట్ర పౌరసరఫరాల శాఖామంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా మంత్రి మనోహర్ పాల్గొన్నారు. ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, విద్యాశాఖ, వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్షించారు. ఆయా శాఖలలో పెండింగ్లో ఉన్న పనులు, దానికి కారణాలు, అత్యవసరంగా చేపట్టాల్సిన వాటి వివరాలను తెలుసుకున్నారు. ప్రతి శాఖలోనూ ప్రాధాన్యతాక్రమంలో ముఖ్యమైన పనులను పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా నందివెలుగు జెడ్‌పి పాఠశాల అదనపు గదుల నిర్మాణం పూర్తికి చర్యలు తీసుకుంటామన్నారు. వివిధ గ్రామాల నుంచి పాల్గొన్న సర్పంచులు, ఎంపీటీసీలు వారి గ్రామాల్లో సమస్యలను మంత్రికి వివరించారు. సమస్యలపై దృష్టి సారిస్తామని మనోహర్ చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఉషశ్రీ, మండల పరిషత్ సిబ్బంది, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

వైసిపి కార్పొరేటర్లతో చర్చిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

వస్తాయని నమ్మకం లేక గత ప్రభుత్వ హయాంలో కాంట్రాక్టర్లు వెనక్కివెళ్లారని, ఇక మీదట ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తామని అన్నారు. అంతకు ముందు గుంటూరు కలెక్టరేట్‌లో ఆదివారం కమిషనర్ చేకూరి కీర్తి, ఇతర అధికారులతో ఆయన సమీక్షించారు. అభివృద్ధి పారదర్శకంగా జరగాలని, అవినీతి తగ్గిపోవాలని అన్నారు. గుంటూరు కార్పొరేషన్ పరిధిలో తాగునీరు, డ్రెయినేజీ వ్యవస్థ, గుంతలు పడ్డ రహదారుల సమస్యలన్నీ ఒక కొలిక్కి తేవడానికి అధికారులు చిత్తశుద్ధితోపనిచేయాలని చెప్పారు. కార్పొరేషన్ పరిధిలో ఏళ్ల తరబడి కొనసాగుతున్న తాగునీటి ఎద్దడి, అస్తవ్యస్తంగా ఉన్న డ్రెయినేజీ సమస్యలపై తక్షణం దృష్టి సారించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసినా ముందుకు సాగని పెండింగ్ పనులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అమృత్ పథకం, యూజిడి పథకంపై ఆయన సమీక్షించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ఏదేని పథకాల ద్వారా పెండింగ్‌లో ఉన్న నిధుల విడుదల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి విడుదలైన నిధులు మినహా గత ఐదేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాకపోవడమే అసలు సమస్యకు కారణమని మంత్రికి అధికారులు వివరించారు. పలు విభాగాలకు చెందిన పెండింగ్ ప్రాజెక్టులపై ఇప్పటికీ సిద్ధం అవ్వని డిపిఆర్ లను 30-45 రోజుల్లో సిద్ధం చేయాలని, తద్వారా కేంద్ర ప్రభుత్వానికి నివేదించి నిధులను విడుదల చేసుకునే బాధ్యత తీసుకోవాలని మంత్రి చెప్పారు.

ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ కార్పొరేషన్ నిధులను కూడా గత ప్రభుత్వం లాగేసుకుందని, వైసిపి కార్పొరేటర్లు తమను ఎన్నుకున్నది గుంటూరు ప్రజలేనని గుర్తుంచుకోవాలని అన్నారు. కార్పొరేషన్‌లో విలీన గ్రామాల పరిస్థితి చాలా అధ్వానంగా ఉందన్నారు. తక్షణం విలీన గ్రామాలకు తాగునీటి వసతి కల్పించాలని కోరారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట్లాడుతూ మురుగు కాల్వలు, మేజర్, మైనర్ డ్రెయిన్లలో సిల్టు తీయకపోవడం వల్ల మురుగు నీరు ప్రజల ఇళ్లల్లోకి చేరుతోందని చెప్పారు. రాబోయే వర్షాకాలం నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు ఇబ్బంది పడితే ఆ ప్రభావం కార్పొరేషన్ పై తప్పక పడుతుందన్నారు. గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి మాట్లాడుతూ కార్పొరేషన్‌లో నిధులన్నీ ఖర్చు చేసినా అభివృద్ధి జరగలేదన్నారు. సున్నా నిధులతో నిండి ఉన్న కార్పొరేషన్ సమస్యలను కూడా పరిష్కరించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. రహదారుల ప్యాచ్‌వర్క్‌లు, ఎలక్ట్రికల్ తదితర సమస్యలు ఎక్కడెక్కడ ఉన్నాయో వివరాలు సేకరించి రాబోయే సమావేశంలో అందజేయాలని అధికారులను కోరారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

- డోకిపర్రు జోసిల్ కంపెనీ వద్ద ద్విచక్ర వాహనాలను ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు
- ముప్పాళ్ల శివారులో ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టిన ట్రాక్టర్

ప్రజాశక్తి - మేడికొండూరు

రోడ్డుపై ముందు వెళుతున్న ద్విచక్ర వాహనాలను, వెనుకగా వస్తున్న ఆర్టిసి బస్సు బలంగా ఢీకొనడంతో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన, మండలంలోని డోకిపర్రు జోసిల్ కంపెనీ వద్ద ఆదివారము జరిగింది. నరసరావుపేట నుండి ఆర్టీసీ బస్సు ప్రయాణికులతో గుంటూరు వైపు వెళుతుంది. మార్గ మధ్యలో కంపెనీ ఎదురుగా నరసరావుపేట రోడ్ లో ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాలను బస్సు వేగం అదుపు తప్పి బలంగా ఢీకొట్టింది . ఈ సంఘటనలో డోకిపర్రు కి చెందిన కొల్లారి దేవదానం, లింగపురం మండలం అమీనాబాద్‌నికి చెందిన పూలు వ్యాపారి షేక్ సుభాని లకు తీవ్ర గాయాలవ్వగా స్థానికులు గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆర్టీసీ బస్సు అదుపు తప్పడంతోనే ప్రమాదం జరిగిందని స్థానికులు చెప్పారు.

ప్రజాశక్తి-ముప్పాళ్ల

ట్రాక్టర్ ఢీకొనడంతో ద్విచక్రవాహనంపై ఉన్న ఇద్దరికీ తీవ్ర గాయాలైన ఘటన మండల కేంద్రంమైన ముప్పాళ్ల గ్రామం ఊరి చివర గల గ్యాస్ గోడౌన్ వద్ద చోటు చేసుకుంది. గోళ్ళపాడుకి చెందిన మాచవరపు నరసింహారావు, బొడ్డపాటి మంగేశ్వరరావు ద్విచక్రవాహనం మీద ముప్పాళ్ల వస్తుండగా ముప్పాళ్ల గ్యాస్ గోడౌన్ వద్దకు రాగానే ట్రాక్టర్ ఢీకొనడంతో నరసింహారావు కు కాలికి, తలకు తీవ్ర గాయాలవ్వగా మంగేశ్వరరావు కు స్వల్ప గాయాలయ్యాయి.క్షతగాత్రులను నర్సారావుపేటలో వైద్య శాలకు తరలించి ప్రథమ చికిత్స అనంతరం గుంటూరు తరలించారు.భాదితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హజరతయ్య తెలిపారు.



డోకిపర్రు, ముప్పాళ్ల శివారులో జరిగిన ప్రమాదంలో గాయపడ్డవారు

మద్యానికి బానిసై కూలి మృతి

ప్రజాశక్తి-చిలకలూరిపేట



మృతుడు పెరు ఏలేష

చీప్ లిక్కర్‌కు బానిసైన కూలి పనులు చేసుకునే వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం సాయంత్రం చిలకలూరిపేటలో జరిగింది. స్థానిక వెంగళరెడ్డి కాలనీ వాసి అయిన పెరు ఏలేష వయసు సుమారు 30 నుంచి 35 ఏళ్ల మధ్య ఉంటుంది. పూల కొట్లోనూ, పెయింట్ పను లు, ఇతర కూలి పనులు చేసుకుని జీవిస్తుంటాడు. ఆదివారం సాయంత్రం సుమారు ఐదు గంటల సమయంలో చిలకలూరిపేటలోని మున్సిపాలిటీ రోడ్డు లోని కోర్టు దగ్గర చెట్టు కింద అపస్మారక స్థితిలో పడిఉన్న అతన్ని చుట్టు పక్కల గమనించారు. 108 అంబులెన్స్ లో చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించారు. అయితే, అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. అతనికి భార్యా, ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. అతనికి సంబంధించిన మరిన్ని వివరాలు తెలిసిన వారు చిలకలూరిపేట అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలని పోలీసులు తెలిపారు.

దాడిలో ముగ్గురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్



పాత గోడలు నేపథ్యంలో ఇరు వర్గాలు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ సంఘటన సత్తెనపల్లిలోని 21వ వార్డులో ఆది వారం జరిగింది. ఈ ఘటనలో పరతాపు నరేంద్ర, కాకాని సాగర్,పరతపు పోలమ్మ లు తీవ్రంగా గాయపడ్డారు. బంధువుల మధ్య నెలకొన్న విభేదాలు కారణంగా ఇరువర్గాలు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తల్లిదండ్రులు మందలించారని ఇంటి నుంచి వెళ్లిపోయిన యువకుడు

ప్రజాశక్తి-దుగ్గిరాల



ఉద్యోగం మానేసి తిరుగుతున్నాడని తల్లి తండ్రి మందలించినందుకు మండలంలోని ఈ మని గ్రామానికి చెందిన తల మాల అశోక్ బాబు మే 18 తేదీన ఇంటి నుండి వెళ్లిపోయినట్టు తండ్రి ప్రశాంత రాజు ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. జూన్ 18వ తేదీ మధ్యాహ్నం వరకు ఫోన్ కాంట్రాక్ట్ తోనే ఉందని స్నేహితులతో మాట్లాడానని, అప్పటినుండి ఫోన్ స్విచ్ ఆఫ్ అయిందని తెలిపారు.. ఎక్కడ నుండి ఫోన్ చేస్తుంది స్నేహితులకు కూడా చెప్పలేదు. అశోక్ వివాహితుడు. ఇద్దరు పిల్లల తండ్రి. జియో షాపులో పనిచేసేవాడు. పని మానేసి తన స్నేహితులతో కలిసి తిరుగుతున్న అశోక్‌ను అతని తల్లి దండ్రులు మందలించారు. దీంతో అతను ఇంటి నుండి వెళ్లిపోయినట్లు తండ్రి తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు మిస్సింగ్ కేసును నమోదు చేసిన దుగ్గిరాల ఎస్సై బి మహేంద్ర విచారణ జరుపుతున్నారు.

సముద్రంలో మంగళగిరి స్వర్ణకార యువకులు ఇద్దరు మృతి

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణనికి చెందిన 12 మంది స్వర్ణకారుల పని చేసే యువకులు ఆదివారం బాపట్ల జిల్లా వేటపాలెం మండలం రామాపురం బీచ్‌కు వెళ్లగా అలల తాకిడికి ఇద్దరు మృతి చెందారు. మృతుల్లో ఒకడైన మంగళగిరి పట్టణంలోని కొప్పురావు కాలనీకి చెందిన పడవల బాలసాయి (24)కి ఏడాది పాప ఉండగా మరో మృతుడు కె.బాలనాగేశ్వరరావు (24)కు ఇంకా వివాహం కాలేదు.

యువకులంతా స్వర్ణకార పని చేస్తూ జీవనం సాగిస్తున్నవారే. ఈ కాలనీలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటనపై మంత్రి నారా లోకేష్ దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మృతదేహాలకు పోస్టుమార్టం వెంటనే పూర్తి చేసి కుటుంబాలకు అప్పగించాలని అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ వారికి అండగా ఉంటామని హామీనిచ్చారు. ఇదిలా ఉండగా మృతుల కుటుంబాలకు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.శంకర్రావు, జిల్లా అధ్యక్షులు పి.మహేష్, నాయకులు ఎ.నాగమల్లేశ్వరరావు, బి.శ్రీనివాసరావు పరామర్శించారు.



మృతి చెందిన బాల సాయి పాపని ఎత్తుకొని ఉన్న చిత్రం, కె.బాలనాగేశ్వరరావు

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

తాడేపల్లి సిఐ కళ్యాణ్ రాజు

ప్రజాశక్తి - తాడేపల్లి

యువత మత్తు పదార్థాలకు గంజాయికి దూరంగా ఉండాలని తాడేపల్లి సీఐ కళ్యాణ్ రాజు సూచించారు. ఆదివారం సాయంత్రం తాడేపల్లి పోలీస్ స్టేషన్లో మాట్లాడారు మత్తు పదార్థాల వినియోగం కారణంగా యువత జీవితాలు దుర్భరమవుతున్నాయని అన్నారు. మత్తు పదార్థాలకు బానిసలై తమ జీవితాలను పాడు చేసుకుంటున్నారని అన్నారు. గంజాయిపై ఉక్కు పాదం మోపుతామని హెచ్చరించారు. ఇప్పటికే బృందాలుగా ఏర్పడి ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు సిఐ తెలిపారు. గంజాయి రహిత తాడేపల్లిగా చేయాలన్నదే తమ ధ్యేయమని అన్నారు.గంజాయికి బానిసలుగా మారి యువత తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకొంటుందని, దాని వల్ల తల్లిదండ్రులు మానసిక క్షోభకు గురవుతున్నారని పేర్కొన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి గంజాయి, మత్తు పదార్థాల విక్రయాలకు పాల్పడేవారి సమాచారాన్ని ఇవ్వాలని కోరారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని ,గంజాయి రహిత తాడేపల్లి కోసం కృషి చేస్తామన్నారు.



జిఎస్‌టి (సెంట్రల్) అధికారుల అసోసియేషన్ ఎన్నిక

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

జిఎస్‌టి సెంట్రల్ ట్యాక్స్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా బి.నవీన్‌రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం గుంటూరు సెంట్రల్ జిఎస్‌టి కమిషనరేట్ పరిధిలోని కృష్ణా, పశ్చిమగోదావరి, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల సెంట్రల్ ట్యాక్సు గెజిటెడ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జనరల్ సెక్రటరీగా కె.యుగంధర్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్స్‌గా సిహెచ్ ఈశ్వరరావు, బి.సుకుమార్, జాయింట్ సెక్రటరీలుగా ఎం.శ్రీకాంత్, సిహెచ్ కన్నారావు, ట్రెజరర్‌గా మిక్కిలినేని శ్రీనివాస్, లైజింగ్ సెక్రటరీగా టివిజికె.మూర్తి ఎన్నికయ్యారు. ఆల్ ఇండియా అధ్యక్ష కార్యదర్శులు హర్పల్ సింగ్, లోక్‌నాథ్, గాదె శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో ఎన్నికలు జరిగాయి.

ఉండవల్లిలో చైన్ స్నాచింగ్

ప్రజాశక్తి - తాడేపల్లి

భారతి అనే మహిళ మెడలో 2.50 లక్షల విలువ చేసే బంగారు గొలుసు స్నాచింగ్.ద్విచక్ర వాహనంపై వచ్చి స్నాచింగ్ కు పాల్పడిన ఇద్దరు యువకులు.నంబర్ ప్లేటు లేని వాహనంపై వచ్చి స్నాచింగ్ కు పాల్పడినట్లు తెలిపిన మహిళవరుసగా మంగళగిరి నియోజవర్గంలో 3 ప్రదేశాల్లో చైన్ స్నాచింగ్.ఒంటరి మహిళలే లక్ష్యంగా రెచ్చిపోతున్న చైన్ స్నాచర్లు. ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసానికి కూతవేటు దూరంలో రెచ్చిపోయిన చైన్ స్నాచర్స్ఉండవల్లి గ్రామంలో భారతి అనే మహిళ మెడలో రూ.2.50 లక్షల విలువ చేసే బంగారు గొలుసు దోచుకెళ్లిన ఆగంతకులుఉండవల్లిలోని సుభాష్ చంద్రబోస్ విగ్రహం పక్క వీధిలో నుంచి మహిళ వస్తుండగా స్నాచింగ్ కు పాల్పడ్డ ఆగంతకులు..నంబర్ ప్లేటు లేని ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు దుండగులు స్నాచింగ్ కు పాల్పడినట్లు తెలిపిన బాధిత మహిళ, ముఖ్యమంత్రి నివాసం ఉన్న గ్రామంలోనే మహిళలకు రక్షణ లేదంటూ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చైన్ స్నాచింగ్..మహిళలు అప్రమత్తంగా ఉండాలి

మంగళగిరి రూరల్ ఎస్సై క్రాంతికిరణ్

ప్రజాశక్తి-మంగళగిరి రూరల్

ఇటీవల మంగళగిర నగరంలో పలు ప్రాంతాల్లో చైన్ స్నాచింగ్ లు జరిగాయని,రూరల్ ప్రాంతం పరిధిలో ఉన్న మహిళలు ఒంటరిగా ఉన్న సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదివారం మంగళగిరి రూరల్ ఎస్సై కాంతి కిరణ్ విజ్ఞప్తి చేశారు.ప్రత్యేకించి ఒంటరిగా ఉన్న మహిళలు ఎంపిక చేసుకొని అకస్మాత్తుగా మెడలోని గొలుసులను తెంచుకొని దొంగలు పారిపోతున్నారని,తగు జాగ్రత్త వహించాలని ఆయన మహిళలకు విజ్ఞప్తి చేశారు. మంగళగిరి మండల రూరల్ ప్రాంతాలలో పోలీసుల గస్తీ నిరంతరం నిఘా ఉంటుందని, అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తున్నట్లయితే వెంటనే పోలీస్ స్టేషన్కు, కానీ విధుల్లో ఉన్న పోలీస్ వారికి కానీ తెలియజేయాలని,రూరల్ ఎస్ఐ కాంతి కిరణ్ కోరారు.



బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న శ్రీ రాజ్యలక్ష్మి ఇన్ఫ్రా డెవలపర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అధినేత అంకినీడు చౌదరి, రియల్టర్స్ అండ్ డెవలపర్స్ కోట శ్రీనివాసరావు

సామాన్యులకు అందుబాటులో 'బృందావనం'

శ్రీ రాజ్యలక్ష్మి ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అధినేత అంకినీడు చౌదరి

ప్రజాశక్తి- పొన్నూరు

రియల్ ఎస్టేట్ రంగంలో ప్రజల పూర్తి విశ్వాసాన్ని, నమ్మకాన్ని చూరగొని విజయ పథంలో ముందుకు పోతున్న బృందావనం వెంచర్ సామాన్యులకు అందుబాటులోకి తెచ్చామని స్థానిక శ్రీరాజ్యలక్ష్మి ఇన్ఫ్రా డెవలపర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అధినేత నన్నపనేని అంకినీడు చౌదరి అన్నారు. పట్టణంలోని నిడుబ్రోలు- కొండమూది రోడ్డులో శ్రీరాజ్యలక్ష్మి ఇన్ఫ్రా డెవలపర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, గృహసంకల్ప రియల్టర్స్ అండ్ డెవలపర్స్ సంయుక్తంగా నూతనంగా వేసిన బృందావనం వెంచర్ బ్రోచర్ల ప్రారంభ సభ ఆదివారం నిర్వహించారు. సభకు గృహ సంకల్ప రియల్టర్స్ అండ్ డెవలపర్స్ ఎమ్‌డి కోట శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. అంకినీడు చౌదరి మాట్లాడుతూ పేదలకు సొంత ఇంటి కలను సాకారం చేసేందుకు శ్రీ రాజ్యలక్ష్మి ఇన్ఫ్రా డెవలపర్స్ ముందుంటుందని అన్నారు. నూరు శాతం క్లియర్ టైటిల్, తక్షణ గృహ నిర్మాణానికి అన్ని హంగులతో వెంచర్ ఏర్పాటు చేశామన్నారు. ఈ వెంచర్‌లో ల్యాండ్ కన్వర్షన్‌తో పాటు ఎస్ కన్వెన్షన్ నిర్మాణం చేపడతామన్నారు.

స్పీకర్‌ను కలిసిన కోడెల శివరాం

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన సభాపతిగా ఎన్నికైన చింతకాయల అయ్యన్న పాత్రుడును టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, డాక్టర్ కోడెల శివరాం మర్యాద పూర్వ కంగా కలిశారు చేశారు. విజయవాడలోని స్పీకర్ క్యాంపు కార్యాలయంలో ఆదివారం అయ్యన్నపాత్రుడు కు శివరాం పుష్పగుచ్ఛం అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. ఘనంగా సత్కరించారు. అనంతరం శివరాం మాట్లాడుతూ ప్రతిష్టాత్మకమైన శాసనసభాపతి స్థానంలో పార్టీ సీనియర్ నాయకులు, తమ కుటుంబానికి ఎంతో ఆప్తులు అయ్యన్న పాత్రుడని అన్నారు. తన తండ్రి కోడెల శివప్రసాదరావు కూడా గతంలో స్పీకర్‌గా పని చేసిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. సభ్యులందరినీ ఏకతాటిపై నడిపే సత్తా గల నాయకుడు అయ్యన్నపాత్రుడు అని కొనియాడారు. అనంతరం వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును, రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా సత్కరించారు.



ఆర్ఎంపి, పిఎంపి మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేస్తున్న చిత్రం

ప్రజల నిరీక్షణ ఫలించింది

ప్రజాశక్తి-విజయపురిసౌత్

ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా మాచర్ల ఆర్ఎంపి, పిఎంపి, మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ కమిటీ సభ్యులు కేక్ కట్ చేసి తమ సంతోషం వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక నెహ్రూనగర్‌లోని కిషోర్ క్లినిక్ లో కడియం కిషోర్ ఆధ్వర్యంలో, కమిటీ పెద్దల సమక్షంలో కేక్ కట్ చేసిబ్రహ్మారెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాచర్ల డివిజన్ గౌరవ అధ్యక్షులు, అసోసియేషన్ ప్రెసిడెంట్ వి. సదాశివ రాజు కమిటీ సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. అసోసియేషన్ వ్యవస్థాపకులు, జనరల్ సెక్రటరీ శ్రీనివాస రాజు మాట్లాడుతూ మాచర్ల నియోజకవర్గం ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న నిరీక్షణ ఫలించిందని, ఎమ్మెల్యేగా జూలకంటి బ్రహ్మారెడ్డి ప్రమాణ స్వీకారం చేశారని అన్నారు. నియోజకవర్గంలో సమస్యలు పరిష్కారమవుతాయని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. వైస్ ప్రెసిడెంట్ సిద్దేశ్వర ఆచార్యులు మాట్లాడుతూ మాచర్ల నియోజకవర్గ ప్రజలకు మంచి రోజులు వచ్చాయని అన్నారు. నియోజకవర్గం అభివృద్ధి, సంక్షేమంపై ప్రత్యేక దృష్టిసారించి ప్రజాపాలన చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎం.శ్రీనివాసాచార్యులు, షేక్ అమీర్ , శేషగిరి , వెంకటేష్, కొండారెడ్డి, హరిబాబు, రాము, షేక్ అమిర్ బాషా, లక్ష్మణ్, ఆర్. మహేష్ , షేక్ సైదా వలి , బొట్ల శ్రీని వాసరావు , నాగూర్ బాషా పాల్గొన్నారు .

కూటమి గెలుపులో కార్యకర్తల కృషి మరువలేం

ప్రజాశక్తి-ముప్పాళ్ల

కూటమి గెలుపులో కార్యకర్తల కృషిని మరువలేమని సత్తైనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ తనయుడు, మాజీ మేయర్ కన్నా నాగరాజు అన్నారు. మండలంలోని కుందురు వారిపాలెంలో తెలుగుదేశం పార్టీ విజయోత్సవ ర్యాలీలో ఆయన పాల్గొని ప్రసంగించారు. గోళ్ళపాడు నుంచి కుందురు వారిపాలెం గ్రామం వరకు ట్రాక్టర్లు, ద్విచక్రవాహనాలతో ర్యాలీ నిర్వహించారు.

కల్తీతో అనారోగ్యంపాలు

- పశుపోషణకు దూరమవుతున్న రైతులు
- గ్రామీణ ప్రాంతాల్లో తగ్గుతున్న పాల ఉత్పత్తి
- అక్రమార్కులు యథేచ్ఛగా కల్తీపాల తయారీ
- పాలు వాసనొస్తే కొనుగోలు చేయొద్దు
- రంగు మారితే కల్తీ జరిగినట్లే

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పశుపోషణ భారంగా మారడం, గిట్టుబాటు ధరలు దక్కకపోవడం వంటి కారణాల దృష్ట్యా గ్రామీణ ప్రాంతాల్లో రైతులు క్రమంగా పశుపోషణకు దూరం అవుతున్నారు. పదుల సంఖ్యలో పశువులు మేపే రైతులు ఒకటి లేదా రెండు పశువులను మేపుతుండగా, చిన్న , సన్నకారు రైతులు మాత్రం పూర్తిగా పశు పోషణకు దూరం అవుతున్నారు. తద్వారా గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణ ప్రజలకు వచ్చే పాల ఉత్పత్తి తగ్గిపోతుండడంతో కొందరు అక్రమార్కులు యథేచ్ఛగా కల్తీపాలు తయారు చేసి ప్రజలకు అంటగడుతున్నారు. ఈ నేపథ్యంలో పాల నాణ్యతపై కథనం..

తెల్లవన్నీ పాలు కావన్నది అందరికీ తెలుసు. కాని గత్యంతరం లేక కల్తీవేవో అసలువేవో తెలియకపోవడంతో తాగుతూనే ఉన్నాం. పట్టణాల్లో ఎలాంటి అనుమతి లేకుండానే పాలు, పాల ఉత్పత్తుల దుకాణాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. వాటిలో పురపాలక, ఆరోగ్యశాఖ తనిఖీలు ఉండటం లేదు. లీటరుకు రూ.80 తీసుకుంటున్నా నాణ్యమైన పాలు దొరకడం లేదని వినియోగదారులు అంటున్నారు. కొందరు రూ.100 తీసు కుంటున్నా నాణ్యమైన పాలు అనే నమ్మకం కలగడం లేదని వినియోగదారులు చెబుతున్నారు.పాలల్లో వెన్న, పిండి పదార్థాలు, మాంసకృత్తులు, విటమిన్లు, ఖనిజ లవణాలు ఉంటాయి. పాలు అత్యవసరమైన పోషకాహారం కావటంతో ప్రభుత్వం ఆహార కల్తీ నిరోధక చట్టం పరిధిలోకి తెచ్చింది. నిబంధనల ప్రకారం పాల విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేయాలంటే పంచాయతీలో కార్యదర్శి పట్టణంలో పుర పాలక శాఖతో పాటు ఫుడ్ ఇన్‌స్పెక్టర్ల అనుమతి తీసుకోవాలి. కానీ పట్టణాల్లోని ప్రధాన కేంద్రాలు తప్ప ఎవరూ అనుమతులు తీసుకోవడం లేదు. కల్తీ పాల తయారీకి ప్రమాదకరమైన పదార్థాలు కలుపుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చిక్కదనం కోసం పాలల్లో కలిపే మాల్టోడెక్టిన్ తో స్థూలకాయం, కాలేయ సమస్యలు వస్తాయని, యూరియా కలిపిన పాలు గర్భిణులు తాగితే నీలిరంగు చర్మం కలిగిన పిల్లల జననం(బ్లూ బేబీ సిండ్రోమ్), మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడతాయని వైద్య నిపుణులు చెబుతున్నారు.

కల్తీని ఇలా గుర్తించవచ్చు...

పాలు వాసన వస్తుంటే కొనుగోలు చేయవద్దు. పాలు రంగు మారినా కల్తీ జరిగినట్లుగా భావించాలి. నోటిలో పోసుకుని రుచిని పరీక్షించాలి. తియ్యగా, పుల్లగా, చేదుగా ఉన్నా కొనుగోలు చేయొద్దు. చప్పగా ఉంటేనే కొనుగోలు చేయాలి. వేడి చేసిన 3 మిల్లీ లీటర్ల పాలల్లో రెండు లేదా మూడు చుక్కల అయోడిన్ వేస్తే నీలిరంగుగా మారిందంటే మైదా కలిసినట్లు. పాలల్లో నీటిని కలిపితే లాక్టోమీటర్‌తో పరీక్షించి గుర్తించవచ్చు. వెన్న శాతం 3.5, లవణాల శాతం 8.5 శాతం ఉంటేనే కొనాలి. పాలను ఒక గ్లాసు నుంచి మరోగ్లాసులోకి పోసినప్పుడు అంటుకున్నట్లు ఉండకపోతే కల్తీ జరిగినట్లుగా భావించాలి. ఇంకా చాలా రకాల పరీక్షలు ఉంటాయి. ఏదైనా దుకాణంలో పాల నాణ్యతపై అనుమానాలు ఉంటే అధికారులకు ఫిర్యాదు చేయవచ్చు. డెయిరీలు, ప్రయివేటు పాల వ్యాపారులు గ్రామాల్లో సేకరించిన పాలు పాడవకుండా 3 గంటల్లోపే చిల్లింగ్ (శీతలీకరణ) కేంద్రాలకు తరలిస్తుండగా, వ్యాపారులు ఇళ్ల ముంగిటకు వచ్చే లోగా పాలల్లో వెన్న తీయడం చిక్కదనం కోసం పాల పౌడర్ కలుపుతున్నారు. ఇలా చేయడం వలన వినియోగదారుల ఆరోగ్యంపై పెద్దగా ప్రభావం చూపక పోయినా కొంతమంది అక్రమార్కులు సన్ ఫ్లవర్ ఆయిల్, యూరియా, పంచదార, పాల పౌడర్, ఉప్పు, గోధుమ పిండి, మైదా పిండి, డాల్డా, నూనెలు కలిపిన కల్తీ పాలను అమ్ము తున్నారనే విమర్శలు ఉన్నాయి. గతంలో నియోజకవర్గంలో పలువురు కల్తీ వ్యాపా రులను సైతం అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేసిన ఘటనలు ఉన్నాయి. పాలు విరిగి పోకుండా బేకింగ్ సోడా, వాషింగ్ సోడా కలుపుతున్నారు. కొందరు రైతులు ఎక్కువ పాల ఉత్పత్తికి పశువులకు ఇంజక్షన్లు ఇస్తుం డటంతో వినియోగదారుల ఆరోగ్యంపై దీని ప్రభావం చూపుతోంది. ఆహార భద్రత అధికారులు స్పందించాలని పాల వ్యాపారులకు అవ గాహన కల్పించి కల్తీపాలు వినియోగం వలన కలిగే అనర్థాల గురించి ప్రజలకు వివరించాల, నాణ్యమైన పాలను విక్రయించేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరు తున్నారు.



కల్తీ పాలను గుర్తించే అధునాతన పరికరాలు

కార్మిక హక్కులను ఐక్యంగా సాధించుకోవాలి

ప్రజాశక్తి - వినుకొండ

కార్మికులందరూ ఐక్యంగా ముందుకు వెళ్లి వారి హక్కులను పోరాటాల ద్వారా సాధించుకోవాలని సిఐటియు పల్నాడు జిల్లా అధ్యక్షులు కె.హనుమంత్ రెడ్డి కోరారు. పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో ఆదివారం కార్పెంటర్ యూనియన్ ఏర్పాటుకు సన్నాహక సమావేశం షేక్ ఖాదర్ బాషా అధ్యక్షతన నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ కార్మికులు వారి సమస్యలను పరిష్కరించు కోవాలన్నా, ప్రభుత్వ నుండి కార్మికులకు అందవలసిన రాయితీలను సాధించుకోవాలన్నా యూనియన్ ద్వారానే సాధ్యమవుతుందని, కార్పెంటర్ కార్మికులం దరూ ఐకమత్యంతో కలిసిమెలిసి పనిచేయాలని కోరారు. కార్పెంటర్ యూనియన్ నూతన కమిటీ ఎన్నికలు 30న ఏర్పాటు చేసేందుకు సభ్యులందరూ నిర్ణయించుకున్నారు. సిఐటియు వినుకొండ టౌన్ గౌరవాధ్యక్షుడు బొంకూరు వెంకటేశ్వర్లు, పల్నాడు జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం కోశాధికారి అంగలకుదురు ఆంజనేయులు, సిద్ధి వెంకటరావు , చోడవరపు జగదీష్, కంచర్ల సుబ్రమణ్యం, పప్పూరి వెంకటప్పయ్య, సిద్ధి భూషణం, గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కె.హనుమంత్ రెడ్డి

సత్తెనపల్లి- గోవా ప్రత్యేక బస్సు

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి నుండి గోవాకు ప్రత్యేక బస్సు సౌకర్యం ఏర్పాటు చేసిననట్లు సత్తెనపల్లి డిపో మేనేజర్ జివిఎస్ఎస్వి కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ సత్తెన పల్లి డిపో నుండి ఈ నెల 25వ తేదీ రాత్రి 8:00 గంటలకు గోవాకు సూపర్ లగ్జరీ బస్సు బయలుదేరి వెళుతుందని చెప్పారు. తిరిగి 29వతేదీ సాయంత్రం గోవాలో బయలుదేరి జులై 2వ తేదీ ఉదయం సత్తెనపల్లికి చేరుతుందని, టికెట్ ధర రాను,పోను ఒక్కొక్కరికి భోజనంతో కలిపి రూ.7,500 అని చెప్పారు. సందర్శకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఉచిత మెగా వైద్యశిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

గ్రామీణ ప్రాంత ప్రజలకు కార్పొరేట్ వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఉచిత మెగా వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు ప్రముఖ ఎముకలు, కీళ్ళ వైద్య నిపుణులు డాక్టర్ గుడారు జగదీష్ అన్నారు.సత్తెనపల్లి మండలం కొమెరపూడి గ్రామంలో గుంటూరు ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ ఆద్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. టిడిపి నాయకులు కంచేటి శివప్రసాద్, యర్రా వెంకటేశ్వరరావు లు ప్రారంభించారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ ఉచిత మెగా వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. రమేష్ హాస్పిటల్స్ వైద్యులు డాక్టర్ గుడారు జగదీష్ ,పి నాగశ్రీహరిత, బాలబాస్కర్, లోకేష్, శివప్రసాద్,మహీదర్ లు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. 858 రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 32మందికీ కీళ్ల మార్పిడి శస్త్ర చికిత్సలు కోసం సిఫార్సు చేశారు.11మందికి గుండె శస్త్ర చికిత్స లు ఇద్దరికీ కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించి సిఫార్సు చేశారు. కార్యక్రమంలో రమేష్ హాస్పిటల్స్ పిఆర్ ఓ భరత్, వైస్ ఎపిపి కొరబండి మస్తాన్ రావు, గ్రామస్తులు చాగంటి శంకర్, తాడికొండ గప్పూర్, పాలడుగు జానీ తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న టిడిపి నాయకులు

220 మందికి బిపి,షుగర్ ట్యాబ్లెట్లు

ప్రజాశక్తి - యడ్లపాడు

యడ్లపాడు అభివృద్ధి కమిటీ, లింగారావుపాలెం విజన్ ఫౌండేషన్ ఆధ్వ ర్యంలో బిపి, షుగర్ ఉచిత వైద్య శిబిరంలో స్థానిక పిఆర్ విజ్ఞాన కేంద్రంలో ఆదివారం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో దాదాపు 220 మంది రోగులకు రెండు నెలలకు సరిపడా ట్యాబ్లెట్లను అందజేశారు. సీనియర్ డాక్టర్ లింగమల్లు మోహన్ భాస్కర్, జూనియర్ డాక్టర్ నేలటూరి రాజశ్రీలు పేషెంట్లకు తగు సూచనలు చేశారు. వైద్యశిబిరం వలంటీర్లకు ఉదయం పూట అల్పాహారాన్ని చెన్నుపాటి పూర్ణ చంద్రరావు సమకూర్చారు. కార్యక్రమంలో యడ్లపాడు అభివృద్ధి కమిటీ సభ్యులు గోనుగుంట్ల కిరణ్, ముత్తవరపు వేణుగోపాల్, కేతా రామబ్రహ్మం, పోపూరి శ్రీనివాసరావు, బచ్చు రాజేష్ కుమార్, అరె వంశీ, పోపూరి ఆర్తి, పిఆర్ విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యులు నూతలపాటి కాళిదాసు, లింగారావు పాలెం విజన్ ఫౌండేషన్ సభ్యులు రావూరి సుమన్, సిహెచ్ రంగారావు, కోయ రామోజీరావు, రావూరిసురేష్ పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న వై.నేతాజి

ఒప్పందాలను అమలు చేయాలి

ప్రజాశక్తి-తాడేపల్లి

అంగన్‌వాడీలు గతంలో దీర్ఘకాలం పోరాటం చేసిన సందర్భంగా అప్పటి ప్రభుత్వం ఇచ్చిన ఒప్పందాలను నేడు అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం అమలు చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా గౌరవాధ్యక్షులు వై.నేతాజీ డిమాండ్ చేశారు. తాడేపల్లి మండల అంగన్‌వాడీ వర్కర్ల సమావేశం ఆదివారం ప్రకాష్‌నగర్ సిఐటియు కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా నేతాజీ మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు. పోరాట సందర్భంలో ఆశ వర్కర్ల టెంట్ల వద్దకు వచ్చి టిడిపి నాయకులు మద్దతివ్వడమే కాకుండా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఇచ్చిన హామీని గుర్తుచేశారు. అంగన్‌వాడీలకు అండగా ఉంటామనీ చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. అప్పుడు ఇచ్చిన హామీలను ప్రస్తుత ప్రభుత్వం అమలు చేసి తమ చిత్తశుద్ధి నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో తాడేపల్లి మండల గౌరవాధ్యక్షులు వేముల దుర్గారావు, కార్యదర్శి కుమారి, పలువురు అంగన్‌వాడీలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



శిక్షణను ప్రారంభించి కంప్యూటర్లను పరిశీలిస్తున్న బి.ఇంద్రాణి తదితరులు

ఐద్వా ఆధ్వర్యంలో కంప్యూటర్ శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి-తాడేపల్లి

నేడు ఉన్న స్పీడ్ యుగంలో టెక్నాలజీ మారిన పరిస్థితుల్లో కంప్యూటర్ శిక్షణ అవసరమని కుంచనపల్లి అరవింద హైస్కూల్ ప్రిన్సిపల్ బి.ఇంద్రాణి అన్నారు. ఆదివారం మేకా అమరారెడ్డి భవన్‌లో మోటూరు ఉదయం ట్రస్టు పేరుతో ఐద్వా ఆధ్వర్యంలో కంప్యూటర్ శిక్షణా కేంద్రాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. కంప్యూటర్ కోర్సుల్లో ముఖ్యంగా డేటా ఎంట్రీ ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుందని చెప్పారు. పెద్ద వ్యాపార సంస్థలతో పాటు విద్యాసంస్థల్లో కూడా డేటా ఎంట్రీ ఆపరేటర్లు పెద్దఎత్తున అవసరముందని చెప్పారు. ప్రాథమిక అవగాహనతో పాటు ఏయే కోర్సుల్లో మనకు మక్కువ ఉందో వాటిని తెలుసుకుని రాణించాలని ఆకాంక్షించారు. నిత్య జీవితంలో కంప్యూటర్ ఒక భాగం అయినందున దాన్ని విడదీసి చూడలేమన్నారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు డి.శ్రీనివాసకుమారి, పట్టణ కార్యదర్శి డి.విజయలక్ష్మి, నాయకులు కె.మేరి, ఎం.లీలమ్మ, సిహెచ్.వెంకటరత్నం, విశ్రాంత ఉద్యోగులు పి.గాంధీ, వై.మల్లారెడ్డి, ఆర్.కోటేశ్వరరావు, శిక్షణ నిర్వాహకులు పాల్గొన్నారు.

'అక్రమ నిర్మాణాల కూల్చివేత సబబే'

ప్రజాశక్తి-తాడేపల్లి

ఇరిగేషన్ స్థలంలో అక్రమంగా నిర్మాణం జరుగుతున్న వైసిపి కేంద్ర కార్యాలయాన్ని ప్రభుత్వ అధికారులు కూల్చడం సబబేనని టిడిపి సీనియర్ నాయకులు జంగాల సాంబశివరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వైసిపి నాయకులు చెప్పినట్లు ఇది కక్ష సాధింపు కాదన్నారు. అమరావతి మాస్టర్ ప్లాన్ మార్చొద్దని కోర్టు స్టే ఇచ్చినా మాస్టర్ ప్లాన్‌లో ఫ్లైవోవర్ చూపిన ప్రాంతంలో ఎటువంటి అనుమతులూ లేకుండా పార్టీ కార్యాలయం ఎలా కడతారని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని బోటుయార్డు స్థలం వాటర్ ట్రాన్స్‌పోర్టు కోసం కూడా ప్లాన్ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అమరావతి మాస్టర్ ప్లాన్‌ను నాశనం చేయాలనే ఉద్దేశంతోనే సీడ్ యాక్సిస్ రోడ్డు ఫ్లైవోవర్ ప్లాన్‌కు భిన్నంగా నిర్మాణాలు చేశారని విమర్శించారు. బకింగ్ హోం కెనాల్ పక్కన ఇరిగేషన్ స్థలం కట్టడం సబబే అయితే ఉండవల్లి అంబేద్కర్‌నగర్, వర్కుషాపు ఉండవల్లి సెంటర్‌లోని ఇళ్లకు పట్టాలు ఎందుకివ్వలేదని గత ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.



ఎపి హెచ్ఎంఎస్ఎ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-గుంటూరు

ఎపి హెచ్ఎంఎస్ఎ నూతన జిల్లా, నగర కార్యవర్గం ఎన్నికైంది. అసోసియేషన్ కార్యవర్గం పదవీ కాలం ముగియటంతో రాష్ట్ర అధ్యక్షులు అరవపాల్ ఆదేశాల మేరకు స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ వై.శ్రీనివాసరావు ఎన్నికల అధికారిగా, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.కిరణ్ పర్యవేక్షణలో ఆదివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా బి.నాగవర్ధన్, కార్యదర్శిగా ఎన్.జీవన్‌బాబు, కోశాధికారిగా బి.వెంకటప్పయ్య ఎన్నికయ్యారు. నగర అధ్యక్షులుగా పి.నరేంద్రబాబు, కార్యదర్శిగా ఎల్.శ్రీనివాసరావు, కోశాధికారిగా పి.పెదసంజీవరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గానికి అరవపాల్ అభినందనలు తెలిపారు.



కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

గ్రామీణాభివృద్ధితో పంచాయతీల పటిష్టానికి కృషిచేయాలి

కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను సందర్శించిన బీసీ సంక్షేమ సంఘం

ప్రజాశక్తి - మంగళగిరి

గ్రామీణాభివృద్ధికి కృషి చేయడం ద్వారా పంచాయతీల పటిష్టతకు, గ్రామ స్వరాజ్య స్థాపనకు కేంద్ర గ్రామీణాభివృద్ధి, సమాచార శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కృషి చేస్తారని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు ఆశాభావం వ్యక్తం చేశారు. తాడేపల్లిలోని మంత్రి నివాసంలో ఆదివారం బీసీ సంక్షేమ సంఘం నాయకులు కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ ముందుగా గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు, ముఖ్యంగా ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా తాగునీరు అందించేలా, యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేలా కృషి చేస్తానన్నారు. కేంద్ర ప్రభుత్వం నుండి రాష్ట్రానికి రావాల్సిన 16వ ఆర్థిక సంఘం నిధులు రాబట్టి స్థానిక సంస్థలను అభివృద్ధి చేస్తామని, ముఖ్యంగా గ్రామాల అభివృద్ధికి, పంచాయతీల పటిష్టతకు దోహదపడతామన్నారు. విభజన హామీల అమలుకు, అణగారిన వర్గాలకు చెందిన బీసీల హక్కుల పరిరక్షణకు, వారి సంక్షేమం- అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు తన్నీరు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, అధికార ప్రతినిధి బాదుగుల శ్రీనివాస్, నాయకులు శివరాం బాబాజీ, కోలా అశోక్, గుంటూరు జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్, స్వాతి గౌడ్, అలా శివాజీ, కిరణ్, జొన్నాదుల వెంకటేశ్వరరావు, వేముల కృష్ణ, రామలింగం పాల్గొన్నారు.

ఆయుర్వేదంపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-గుంటూరు

రోగం తీవ్రమై చికిత్స జటిలమై ఇల్లూ ఒళ్లు, గుల్ల చేసుకోవటం కంటే ఆయుర్వేదంలోని చికిత్స విధానాలను గురించి తెలుసుకోవటం వల్ల జరిగే మేలు అంతా ఇంతా కాదని ప్రముఖ ఆయుర్వేద వైద్యులు డాక్టర్ దివి సీతారాం కిషోర్ అన్నారు. ఆదివారం అరండల్‌పేటలోని అవగాహన కార్యాలయంలో వి.వి.రావ్ అధ్యక్షతన జరిగిన ఆరోగ్య సభలో డాక్టర్ సీతారాం కిషోర్ మాట్లాడుతూ ఆయుర్వేదం మూలసిద్ధాంతం అనారోగ్యంగా ఉన్న వ్యక్తిని ఆరోగ్యంగా ఉంచటంతోపాటు, అనారోగ్యం ఉన్న వ్యక్తిని ఆరోగ్యంగా మార్చటం అన్నారు. శారీరక ఆరోగ్యంతోపాటు మానసిక ఆరోగ్య స్థిరత్వానికి కూడా చాలా ప్రాధాన్యమిచ్చిన వైద్యం ఆయుర్వేదం అన్నారు. ఆహారం, విహారం, నిద్ర అనే మూడు విషయాలు సమతుల్యత పాటించకపోతే అనారోగ్యానికి గురవుతారని అన్నారు. ఆయుర్వేద మందులు వేడి చేస్తాయనేది కేవలం అపోహ మాత్రమే అన్నారు. ఆయుర్వేద వైద్యులు రోగి శరీర తత్వం పరీక్షించి చికిత్స చేస్తారని, ఈ విధానంలో ఔషధ చికిత్సతోపాటు, శోధన చికిత్స అని పిలిచే పంచకర్మ చికిత్స చాలా ముఖ్యమైందని వివరించారు. దీర్ఘకాలిక వ్యాధులు పదే పదే వచ్చే రోగాలకు మూలం నుండి చికిత్స చేయగలిన సామర్థ్యం, ఆపరేషన్ లేకుండా వైద్యంతో తగ్గించే సామర్థ్యం ఈ పంచకర్మకి ఉందన్నారు. సభలో ఏలూరి సూర్యనారాయణ, వి.సత్యన్నారాయణ ప్రసంగించారు.



మాట్లాడుతున్న డాక్టర్ సీతారాం కిషోర్



కొండవీడు కోటలో ఎన్‌సిసి క్యాడెట్లు

ప్రజాశక్తి-గుంటూరు

కొండవీడు కోటలో ఆదివారం వివిధ రాష్ట్రాలకు చెందిన ఎన్‌సిసి క్యాడెట్స్‌తో క్యాంప్ నిర్వహించారు. కెఎల్ యూనివర్సిటీలో బేస్ ఏర్పాటు చేసిన వీరు ఆదివారం కొండవీడులో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ క్యాంప్‌లో ట్రెక్కింగ్, పరుగు, అవుట్రైవల్స్ ట్రేకింగ్ అకాడమీ సాయంతో దళవాయి ఆషారాపిలింగ్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ క్యాంప్‌లో ముఖ్యంగా రాజస్థాన్ నుండి 150 మంది, ఆంధ్రప్రదేశ్ నుండి 450 మంది, పలు రాష్ట్రాలకు చెందిన ఎన్‌సిసి క్యాడెట్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్యాడెట్లు వారి అనుభవాలను పంచుకున్నారు. కొండవీడులో పచ్చదనం, చారిత్రక కట్టడాలు బాగున్నాయని పేర్కొన్నారు. అడ్వంచర్ యాక్టివిటీ జోన్, యోగి వేమన మండపం, పుట్టలమ్మ చెరువు, వరాల కొట్టు, ముత్యాలమ్మ చెరువు, దర్గా, శిథిల దేవాలయం, వెదుళ్ల చెరువు, రెడ్డివారి భోజనశాల, గుర్రపుశాలను పలు ప్రాంతాలను సందర్శించారు. ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్‌లో భాగంగా వివిధ రాష్ట్రాలకు చెందిన ఎన్‌సిసి క్యాడెట్స్‌తో ఒకేచోట ఈ క్యాంప్ ఏర్పాటు చేసినట్లు ఎన్‌సిసి అధికారులు తెలిపారు. కార్యక్రమంలో కల్నల్ చంద్రశేఖర్, కల్నల్ సిద్ధు, కల్నల్ సుదర్శన్, అటవీ శాఖ బీట్ ఆఫీసర్ రాజు, కొడాలి వెంకటేశ్వరరావు, కొండవీడు కోట అభివృద్ధి కమిటీ కన్వీనర్ కల్లి శివారెడ్డి పాల్గొన్నారు.

కొల్లి సామ్రాజ్యంకు ప్రముఖుల నివాళులు

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి వాణి ట్యుటోరియల్ వ్యవస్థాపకులు కొల్లి నాగేశ్వరరావు (కెఎన్ఆర్) భార్య సామ్రాజ్యం సంస్మరణ కార్యక్రమం ఆదివారం జరిగింది. పలువురు ప్రైవేట్ విద్యాసంస్థల ప్రతినిధులు, వివిధ రంగాల ప్రముఖులు హాజరై సామ్రాజ్యం చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ గంజి చిరంజీవి, వీజే విద్యాసంస్థల డైరెక్టర్ ప్రగడ రాజశేఖర్, ఎస్-ఎల్ఎం చైతన్య హైస్కూల్ డైరెక్టర్ శిందే బాలకృష్ణ, నిర్మల జూనియర్ కాలేజీ డైరెక్టర్ వివి ప్రసాద్, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు అవ్వారు సత్యనారాయణ, వీసం వెంకటేశ్వరరావు, డాక్టర్ ఓంకార మూర్తి, వి.గోపిరెడ్డి, కాట్రూ రామారావు, కొల్లి శ్రీను తదితరులు నివాళులర్పించారు.



సామ్రాజ్యం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రముఖులు

విద్యార్థుల సంఖ్య పెంచడమే లక్ష్యం..

- ప్రభుత్వ పాఠశాలలకు ఆకర్షించేందుకు 'నేను బడికి పోతా'
- జులై 12 వరకు పలు కార్యక్రమాలు

ప్రజాశక్తి-పెదకూరపాడు

ప్రైవేటు, కార్పొరేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలను నడపాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా 'నేను బడికి పోతా' కార్యక్రమాన్ని చేపట్టారు. విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలకు ఆకర్షించే నిమిత్తం జూలై 12వ తేదీ వరకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

పాఠశాల కమిటీ ఏర్పాటు

పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచడానికి పాఠశాల కమిటీని ఏర్పాటు చేశారు. ఆ కమిటీలో పాఠశాల కమిటీ చైర్మన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కన్వీనర్ గా ఉంటారు. గ్రామపంచాయతీ కార్యదర్శి, సిఆర్పి, వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్, ఆ ప్రాంత వాలంటీరు, అంగన్వాడీ సిబ్బంది సభ్యులుగా ఉంటారు. వీరంతా ఆ పాఠశాల పరిధిలో ఇంటింటికి తిరగటం. బడి ఈడు పిల్లల్ని పాఠశాలకు పంపమని నచ్చజెప్పటం, అనివార్య కారణాలవల్ల గత ఏడాది పాఠశాల మానేసి వారిని మరల పాఠశాలలో చేర్పించే విధంగా మోటివేషన్ చేయటం జరుగుతుంది. ఉపా ధ్యాయులు, కమిటీ ఇంటింటికి తిరిగి తల్లిదండ్రులకు తెలియ జేస్తున్నారు



ప్రతిచోటా ర్యాలీ, ఇంటింటి పచారం

మండలంలో 41 పాఠశాలలు ఉన్నాయి. వీటిలో హైస్కూల్ 4, యూపీ స్కూల్ 4, ప్రాథమిక పాఠశాలలో 33 ఉన్నాయి. ప్రతి పాఠశాలకు కమిటీలు వేశారు. ఉన్న విద్యార్థుల సంఖ్యను నిలుపుకోవడం, కొత్త విద్యార్థులను చేర్చుకోవడమే లక్ష్యంగా పనిచేస్తున్నారు. గతంలో మానేసిన డ్రాప్ అవుట్లను మరల పాఠశాలకు తీసుకురావడమే ధ్యేయంగా మండల విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పనిచేస్తున్నారు. ప్రతి గ్రామంలో ర్యాలీలు చేస్తున్నారు. ఇంటింటి ప్రచారంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థిని విద్యార్థులకు అన్ని సౌకర్యాలతో పాటు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోట్స్ లు, స్కూలు యూనిఫామ్, బెల్టులు, బ్యాగులు ఇవ్వడం జరుగుతుందని ప్రచారం చేస్తున్నారు. ప్రభుత్వం అందించే మధ్యాహ్న భోజనం, ఇతర అంశాలు కూడా వివరిస్తున్నారు.

స్పందన బాగుంది: సత్యనారాయణ, ఎంఇఒ-2



పాఠశాలలో విద్యార్థులను చేర్చమని ప్రచారం చేసే సమయంలో తల్లిదండ్రుల నుండి స్పందన బాగుం దని పెదకూరపాడు మండల విద్యా శాఖ అధికారి-2 సత్యనారాయణ అన్నారు. ప్రతి పాఠశాల పరిధిలో కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. వారందరూ ఇంటింటికి తిరిగి ప్రచారం చేస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం అవడానికి సహకరించాలన్నారు.



కోటేశ్వరరావును సత్కరిస్తున్న అరవిందబాబు దంపతులు

చాగంటి కోటేశ్వరరావును కలిసిన ఎమ్మెల్యే దంపతులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచన కర్త చాగంటి కోటేశ్వరరావు సూక్తులు ప్రతి ఒక్కరూ ఆచరించదగినవని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. నరసరావుపేట కళా వేదిక అధ్యక్షులు పొన్నపాటి ఈశ్వరరెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలో రెండు రోజుల పాటు ఆధ్యాత్మిక ప్రవచనాలు చెప్పేందుకు వచ్చిన చాగంటి కోటేశ్వరరావును ఎమ్మెల్యే దంపతులు కలిశారు. నరసరావుపేటలోని జమిందారీ ఫంక్షన్ హాలులో ఆయనను కలిసి సత్కరించారు.సమాజాన్ని ప్రభావితం చేయగల విలువైన మాటలు చెప్పడంలో చాగంటి కోటేశ్వరరావు దిట్ట అని ఎమ్మెల్యే కొనియాడారు. చాగంటి ఆధ్యాత్మిక ప్రవచనాలు వినేందుకు పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు.



పవన్ కుమార్‌ను సత్కరిస్తున్న ఎంఎస్‌పి కార్యకర్తలు

7న ఎంఆర్‌పిఎస్ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

దళితులు,అణగారిన వర్గాల హక్కులు సంక్షేమం కోసం 30 ఏళ్లుగా అలుపెరగక పోరాటం చేస్తున్న ఎం.ఆర్.పి.ఎస్ ఆవిర్భావ వేడుకలను జులై 7న ఘనంగా నిర్వహించాలని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షులు కనుమూరి కోటేశ్వరరావు మాదిగ పిలుపునిచ్చారు. ఆదివారం పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలోని 24వ వార్డులో ఎం ఎస్ పి నియోజకవర్గం సమావేశం జరిగింది. ఈ సమావేశానికి నియోజకవర్గ ఇన్‌చార్జి మల్లవరపు బాబు మాదిగ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ మాదిగల ఆత్మగౌరవ కవాతును 'చలో వరంగల్' జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉమ్మడి ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మాదిగలు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. అనంతరం నియోజకవర్గ వికలాంగుల హక్కుల పోరాట సమితి పట్టణ అధ్యక్షులుగా 24వ వార్డుకు చెందిన పి. పవన్ కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పవన్ కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గంలో వికలాంగుల సమస్యలపై పోరాటం చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ కు కతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. వికలాంగుల సమస్యలు పెద్దల దష్టికి తీసుకు వెళ్లి పెన్షన్ రూ 3 వేలు నుండి 6 వేలకు పెంచడంలో మందకృష్ణ మాదిగ కీలకంగా వ్యవహరించారని చెప్పారు. కార్యక్రమంలో ఎం ఎస్ పి జిల్లా అధికార ప్రతినిధి పి.రాములు మాదిగ, పట్టణ ఇంచార్జ్ సిహెచ్ నాగరాజు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు తీరే మంచిరోజులొచ్చాయి

లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే జివి ఆంజనేయులు

ప్రజాశక్తి - వినుకొండ



ఐదేళ్ల ప్రార్థనలు ఫలించి వినుకొండ నియోజకవర్గపు ప్రజల సమస్యలు తీరే మంచి రోజులు వచ్చాయని స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. స్థానిక కొండమెట్ల వద్ద స్వయంభు శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో ఆదివారం జరిగిన పూర్ణాహుతి కార్యక్రమంలో ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు దంపతులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు పాల్గొన్నారు. 41 రోజులపాటు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో విశేష కార్యక్రమాలు నిర్వహిం చారు. పౌర్ణమి సందర్భంగా ఆదివారం ఆలయంలో నిర్వహించిన అభిషేకం, ప్రత్యేక హోమంలో వారు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో మూడవసారి అద్భుతమైన మెజార్టీ తో గెలిపించిన వినుకొండ ప్రజానీకానికి తన కృతజ్ఞతలు తెలిపారు. వినుకొండ ప్రాంతం దినదినాభివృద్ధి చెందా లని, మంచినీటి సమస్య పరిష్కారం కావాలని కోరు కుంటున్నట్లు చెప్పారు. ఏటా సమద్ధి వానలతో రైతులకు మంచి పంటలు పండాలని, రైతుకూలీలు, కార్మికులు, అన్నివర్గాల ప్రజల సంతోషం కోసమే ఆలయాన్ని సందర్శించినట్లు చెప్పారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులు ప్రారంభించే ముందు ఆలయాన్ని సందర్శిం చానని అన్నారు. వినుకొండ ప్రాంత అభివృద్ధికి తన శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని, ప్రజా సమస్యలను పరిష్కరిస్తానని అన్నారు.

మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లి కార్జునరావు మాట్లాడుతూ ఈ నియోజకవర్గంలో అన్ని రకాల అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతాయని అన్నారు. అభివృద్ధి కార్యక్రమాల్లో జీవీకి తనతో పాటు జనసేన, బిజెపి నాయకుల అండదండలు ఉంటాయని చెప్పారు. త్వరలోనే ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులకు మరొక ఉన్నతమైన పదవి రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని అన్నారు.

పేద విద్యార్థినికి ల్యాప్‌టాప్

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్



ల్యాప్‌టాప్ అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీ నారాయణ

పేద విద్యార్థికి సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీ నారాయణ ల్యాప్ టాప్ అందచేశారు. మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్ఆర్ఐ మాగులూరి భాను ప్రకాష్ సహకారంతో పేద విద్యార్థికి ల్యాప్ ట్యాప్ అందజేశారు. సత్తెనపల్లి పట్టణంలోని రఘురాం నగర్ కు చెందిన కొఠారు తను శ్రీలక్ష్మి కి రూ.40 వేలు విలువ చేసే ల్యాప్ టాప్ కన్నా లక్ష్మీ నారాయణ అందచేశారు. ఈ కార్యక్రమంలో మాగులూరి ఫౌండేషన్ సభ్యులు కుంచనపల్లి కిరణ్ టిడిపి నాయకులు కోమటినేని శ్రీనివాస రావు ఏపూరి సుబ్బారావు,ఏపూరి లక్ష్మీ నారాయణ, అంచుల నరసింహారావు పాల్గొన్నారు.

పల్నాడు జిల్లా కేంద్రంగా మాచర్లను ప్రకటించండి

ప్రజాశక్తి - విజయపురిసౌత్



మాట్లాడుతున్న షేక్ సైదా సూరజ్

వెనుకబడిన పల్నాడు అభివృద్ధి చెందాలంటే జిల్లా కేంద్రంగా మాచర్ల లేదా గురజాలను ప్రకటించాలని సామాజిక కార్యకర్త ఉద్యమకారుడు షేక్ సైదా సూరజ్ డిమాండ్ చేశారు. ఆదివారం సైదా సూరజ్ విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వాలు ఎన్ని మారినా పల్నాడు అభివృద్ధికి మాత్రం కృషి చేయడం లేదని విమర్శించారు. మాచర్ల, గురజాల ప్రాంతంలో జిల్లా కేంద్రం ఏర్పాటుకు ఎన్నో వేలాది ఎకరాలు ప్రభుత్వ భూములు ఉన్నాయన్నారు. మాచర్లకు కూత వేట దూరంలో నాగార్జునసాగర్ రిజ ర్వాయర్ అందుబాటులో ఉందని, జిల్లా కేంద్రంగా మాచర్లను ప్రకటిస్తే చుట్టుపక్కల ఉన్న వందలాది తండాలు అభివృద్ధి లోకి వస్తాయన్నారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటకు మాచర్ల చాలా దూర మైందని, తద్వారా ఈ ప్రాంత వాసులకు సరైన, విద్య, వైద్యం అందక ఎంతోమంది ఇబ్బందులు పడుతున్నారన్నారు. అదే మాచర్లను పల్నాడు జిల్లాకేంద్రంగా ప్రకటిస్తే ఈ ప్రాంతంలో ఎన్నో పరిశ్రమలు, కార్పొరేట్ స్థాయి వైద్యశాలలు, జిల్లా ఉన్నతాధి యంత్రాంగమంతా ఈ ప్రాం తంలోనే ఉంటుందన్నారు. తాము అధికారంలోకి వస్తే మాచర్లను లేదా గురజాలను జిల్లాకు కేంద్రంగా ప్రకటిస్తామని గతంలో ప్రతిపక్షంలో ఉన్న యరపతినేని శ్రీనివాసరావు ఇచ్చిన హామీని ఆయన గుర్తు చేశారు. అదేవిధంగా మాచర్ల ఎమ్మెల్యేగా విజయం సాధించిన జూలకంటి బ్రహ్మా రెడ్డి ఈ ప్రాంత అభివృద్ధికి దృష్టి సారించాలని కోరారు. అబ్దుల్ కలాం సేవాసమితి అధ్యక్షులు పాషావలి, చాకలి ఐలమ్మ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మన్నెం పాండురంగారావు మాట్లాడుతూ ఈ ప్రాంతం దశాబ్దాలు గడుస్తున్న అభివృద్ధికి మాత్రం నోచుకోవడం లేదన్నారు. ఎమ్మెల్యేలు యరపతినేని శ్రీనివాసరావు, జూలకంటి బ్రహ్మా రెడ్డి ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లాలని, పల్నాడు ప్రాంత అభివృద్ధికి పాటు పడాలని కోరారు.

టిడిపి నేత అక్కిరెడ్డి పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - మాచర్ల



మాచర్ల నియోజకవర్గం టిడిపి నాయకులు, జూలకంటి బ్రహ్మానందరెడ్డి సమీప బంధువు, జూలకంటి అక్కిరెడ్డి పుట్టినరోజు వేడుకలు మాచర్ల పట్టణంలో ఆదివారం జరిగాయి. పార్టీ అభి మానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిర్వహణ లేక నిరుపయోగంగా..!

- శిథిలావస్థకు చేరి ఖాళీ ఉన్న పోలీస్ క్వార్టర్స్
- కిటికీలు తలుపులకు చెదలు, పాడైన పరికరాలు
- చిట్టడవిని తలపించేలా ప్రాంగణం
- నూతన నిర్మాణాల కోసం సిబ్బంది విన్నపం


పోలీస్ క్వార్టర్స్ భవనం


చెట్లతో నిండిన క్వార్టర్స్ ఆవరణ.. దెబ్బతిన్న కిటికీలు (ఇన్‌సెట్)


దెబ్బతిన్న క్వార్టర్స్‌లోని విద్యుత్ మీటర్లు

ప్రజాశక్తి - పొన్నూరు

ప్రజల పరిరక్షణ, శాంతి భద్రతలు కాపాడాల్సిన పోలీసుల క్వార్టర్స్ నిర్వహణ లోపించి పోలీస్ సిబ్బంది అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. పొన్నూరు రూరల్, అర్బన్ పోలీస్ స్టేషన్ స్టాఫ్ క్వార్టర్స్ ప్రారంభించిన దశాబ్ద కాలానికి నిర్వహణ కొరవడి మరమ్మతులకు గురయ్యాయి. ఈ క్వార్టర్స్‌ను 2006లో అప్పటి ఉమ్మడి రాష్ట్ర హోం మంత్రి జానారెడ్డి ప్రారంభించారు. ప్రస్తుతం క్వార్టర్స్ ప్రాంగణమంతా పిచ్చి మొక్కలతో నిండి విష సర్పాలకు ఆవాసాలుగా మారింది. టౌన్ పోలీస్ స్టేషన్ సిబ్బంది కోసం12 సూట్లు, రూరల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది కోసం 8 నివాస గృహాలు నిర్మాణం చేశారు. రూరల్ పోలీస్ స్టేషన్ క్వార్టర్స్ పూర్తిగా ధ్వంసం అవ్వడంతో పోలీస్ సిబ్బంది నివాసాలు ఖాళీ చేసి బయట అద్దె ఇళ్లల్లో ఉంటున్నారు.

కోట్లాది రూపాయలు ప్రజాధనం వెచ్చించి నిర్మించిన క్వార్టర్స్ పూర్తిగా శిథిలమై కూలటానికి సిద్ధంగా ఉంది. విద్యుత్ మోటారు, పైపులైన్లు ధ్వంసమయ్యాయి. భవన రంగులు పూర్తిగా మాసిపోయి ప్రేతకళ సంతరించుకుంది. లోపలి భాగంలో అంతర్గత రోడ్లు చేపట్టలేదు. క్వార్టర్స్ విద్యుత్తు మెయిన్ బోర్డులో ఫీజు క్యారియర్స్ పాదయ్యాయి. విద్యుత్తు వైర్లు బయటపడి వేలాడుతున్నాయి. నూతనంగా హోం మంత్రి, స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా పోలీసులు అధికారులు దీనిపై స్పందించాలని, శిథిల భవనాలను తొలగించి నూతన పోలీసు క్వార్టర్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని పోలీస్ సిబ్బంది కోరుతున్నారు.


మంత్రి మనోహర్‌ను కలిసిన జయదేవ్

మంత్రి మనోహర్‌ను కలిసిన జయదేవ్

ప్రజాశక్తి-తెనాలిరూరల్

తెనాలి పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో రాష్ట్ర ఆహార పౌరసరఫరాలు మంత్రి నాదెండ్ల మనోహర్‌ను గుంటూరు మాజీ ఎంపీ గల్లా జయదేవ్ మర్యాద పూర్వకంగా కలిశారు. పోటీ చేసిన అన్ని స్థానాల్లో జనసేన అభ్యర్థులు గెలవడంతోపాటు కూటమి ప్రభుత్వంలో పవన్‌కల్యాణ్, నాదెండ్ల మనోహర్ మంత్రి పదవులు పొందినందుకు శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు చిట్టాబత్తిన చిట్టిబాబు, కోవెలమూడి రవీంద్ర, డేగల ప్రభాకర్ ఉన్నారు.



టిడిపి నాయకులకు సన్మానం

ప్రజాశక్తి - మంగళగిరి

ఎమ్మెల్యేగా నారా లోకేష్ విజయానికి కృషి చేసిన టిడిపి గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, టిడిపి మంగళగిరి నియోజకవర్గం సమన్వయకర్త నందం అబద్ధయ్యను ఆదివారం వారి నివాసాల్లో టిడిపి బీసీ సెల్ నాయకులు కలిసి సత్కరించారు. కార్యక్రమంలో టిడిపి బీసీ సెల్ నియోజవర్గ అధ్యక్షులు కారంపూడి అంకమ్మరావు, బీసీ సెల్ టిడిపి నాయకులు బి.శ్రీనివాసరావు, ఎస్.రంగబాబు, ఎ.నాగేశ్వరావు, టి.శ్రీనివాసరావు, పి తిరుపతయ్య, కె.కొండలు, జె.ఏడుకొండలు పాల్గొన్నారు.


విలేకర్లతో మాట్లాడుతున్న నాయకులు

కమర్షియల్ ట్యాక్స్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి ఆర్టీసీ డిపో రోడ్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో కమర్షియల్ టాక్స్ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం జరిగింది. అనంతరం అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేష్‌బాబు విలేకర్లతో మాట్లాడారు. 2023లో 2.0లో భాగంగా నిబంధనలను విరుద్ధంగా సిబ్బందిని బదిలీ చేశారని, 1400 పోస్టులు రద్దు చేశారని అన్నారు. ఆయా సమస్యలపై గత ప్రభుత్వాన్ని ఎన్నిసార్లు విన్నవించుకున్నా ఫలితం దక్కలేదని, తాజా ప్రభుత్వం కమర్షియల్ టాక్స్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి కె.సుధాకర్‌బాబు మాట్లాడుతూ రెసిడెన్షియల్ ఆర్డర్‌కు వ్యతిరేకంగా బదిలీలు జరిగాయని, ఉద్యోగులకు ఇబ్బందికరంగా ప్రాంతీయ కార్యాలయాలు తెచ్చారని చెప్పారు. జీఎస్టీలో వారికి ఆడిట్, వీటిసి పవర్ ఇస్తే ప్రభుత్వానికి ఎక్కువ ఆదాయం వచ్చే అవకాశం ఉందన్నారు. ఇదిలా ఉండగా సమావేశంలో 16 డివిజన్ల నుండి 100 మంది రాష్ట్ర కార్యవర్గ ప్రతినిధులు పాల్గొని అభిప్రాయాలను వ్యక్తం చేయగా వాటికనుగుణంగా తీర్మానాలను ఆమోదించారు. కోశాధికారి జిఎన్‌వి రత్నకుమార్, గుంటూరు డివిజన్ అధ్యక్షులు ఎం.నాగరాజు పాల్గొన్నారు.

సీతానగరంలో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-తాడేపల్లి : సీతానగరం జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆశ్రమ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు నిర్వహణలో ఉచిత వైద్యశిబిరం ఆదివారం నిర్వహించారు. బిపి, షుగర్ పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. మణిపాల్ ఆసుపత్రి వైద్యులు వైద్యసేవలు అందించారు.

శుక్లాల ఆపరేషన్‌కు 304 మంది ఎంపిక

ప్రజాశక్తి - పొన్నూరు


శిబిరాన్ని ప్రారంభించి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర

పేదలకు, విద్యా, వైద్య, సమాజ సేవ రంగాల్లో పొన్నూరు రోటరీ క్లబ్ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ అన్నారు. నిడుబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శంకర కంటి ఆస్పత్రి, రోటరీ క్లబ్ ఆఫ్ పొన్నూరు, రోటరీ సర్వీసెస్ సొసైటీ, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్తంగా ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ పొన్నూరు అధ్యక్షులు బండారుపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజ హితం కోసం ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించి రూ.లక్షలతో శుక్లాల శస్త్ర చికిత్సలు నిర్వహించటం అభినందనీయమన్నారు. శంకర్ కంటి ఆసుపత్రి కో-ఆర్డినేటర్ సైదులు మాట్లాడుతూ శిబిరంలో పొన్నూరు పరిసర ప్రాంతాల నుంచి 530 మందికి పరీక్షలు నిర్వహించగా 304 మందికి కంటి శుక్లాల శస్త్ర చికిత్సలు నిర్వహించాలని వైద్యులు నిర్ధారించారని తెలిపారు. ఈ నెల 25వ తేదీ నుండి 28వ తేదీ వరకు పెదకాకాని ఆసుపత్రిలో ఆపరేషన్లు జరుగుతాయని చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను సత్కరించారు. ఇటీవల మృతి చెందిన రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షులు, రోటరీ క్లబ్ స్థలదాత కొసరాజు సత్యనారాయణకు సంతాప సూచికంగా మౌనం పాటించారు. రోటరీ క్లబ్ కార్యదర్శి బి.రామారావు, ఎగ్జిక్యూటివ్ సెక్రెటరీ ఎన్.బాలకృష్ణ, కోశాధికారి మేఘనాథ్, సీనియర్ రోటరీ క్లబ్ సభ్యులు పాములపాటి రవీంద్రనాథ్, ఎంఎం కుద్దూస్, మహమ్మద్ జిలాని, తోట భానుప్రసాద్, జిఎంఎస్ గుప్తా, రామకృష్ణ, రాజేంద్ర, కిషోర్, వెలగ వెంకటేశ్వర్లు, కారుమూరి శ్రీనివాసరావు, శివరామకృష్ణ పాల్గొన్నారు.

'చంద్రబాబు పాలనలోనే మహిళలకు రక్షణ'

ప్రజాశక్తి - మంగళగిరి : బాపట్ల జిల్లా చీరాల మండలం, ఈపురుపాలెంలో చేనేత సామాజికతరగతికి చెందిన యువతిపై అత్యాచారం చేసి కిరాతంగా హత్య చేయడం దుర్మార్గమైన చర్యని తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల జయసత్య, కార్యదర్శి వింజమూరి ఆషాబాల అన్నారు. ఈ మేరకు స్థానిక టిడిపి కార్యాలయంలో ఆదివారం వారు విలేకర్లతో మాట్లాడారు. ఘటనా స్థలిని సిఎం చంద్రబాబబు ఆదేశాలతో హోం మంత్రి అనిత పరిశీలించడంతో పాటు మృతురాలి కుటుంబాన్ని పరామర్శించారని చెప్పారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరుపున రూ.10 లక్షల ఆర్థిక సాయం అందించినట్లు తెలిపారు. నిందితులను 48 గంటల్లో అరెస్ట్ చేస్తామని ప్రకటించి 36 గంటల్లోనే పట్టుకోవడం ద్వారా చంద్రబాబుకు మహిళల పట్ల ఉన్న గౌరవం, నిబద్ధత మరోసారి తెలిసిందన్నారు. రాష్ట్రంలో గంజాయి, ఇతర మత్తు పదార్థాలను పూర్తిగా నిర్మూలించేందుకు చంద్రబాబు, లోకేష్ చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో యలమంచిలి పద్మజ, పోలు దుర్గ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా అత్యాచారం, హత్య ఘటనను బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్ ఒక ప్రకటనలో ఖండించారు. ఈ ఘాతుకానికి పాల్పడ్డ గంజాయి ముఠాను తీవ్రంగా శిక్షించాలని కోరారు. బీసీలపై జరిగే ఆకృత్యాలను రూపుమాపడానికి బీసీ రక్షణ చట్టాన్ని సత్వరమే రూపొందించాలని కోరారు.



రోటరీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులుగా శివప్రసాద్, నాగేశ్వరావు

ప్రజాశక్తి-పెదనందిపాడు రూరల్

రోటరీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులుగా 2024-25 సంవత్సరానికి గాను ఎన్.శివప్రసాద్. ఎన్‌విఎస్ నాగేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు పెదనందిపాడు రోటరీ క్లబ్ అధ్యక్షులు వై.కోదండరామిరెడ్డి ఆదివారం తెలిపారు. వారికి క్లబ్ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు. క్లబ్ సభ్యుల సహకారంతో సేవలను మరింత విస్తృతం చేస్తామని శివప్రసాద్ చెప్పారు.

బాలుర వసతి గృహానికి అద్దె భవనం అవసరం

ప్రజాశక్తి - పొన్నూరు

పట్టణంలోని ప్రభుత్వ వెనుకబడిన తరగతుల సంక్షేమ కళాశాల బాలురు వసతి గృహం ఏర్పాటుకు భవనం అద్దెకు కావాలని స్థానిక హెచ్‌డబ్ల్యూఓ నాయుడు వీరాస్వామి తెలిపారు. 100 మంది విద్యార్థులకు సరిపడ అన్ని వసతులు గల భవనం అద్దెకు కావాలని, చదరపు అడుగుకు రూ.ఆరు చొప్పున చెల్లిస్తామని, వివరాలకు 8328402156 ఫోన్ నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

ఆ స్థలానికి అన్నీ బాలారిష్టాలే...!

రూ.కోటి ప్రజాధనం మట్టిపాలు - నిర్మాణం పూర్తయినా వృత్తిదార్లకు దక్కని గదులు



కోర్టు స్టే ఇచ్చినట్లు ఏర్పాటు చేసిన బోర్డు.. స్థలం తమదని మున్సిపాల్టీ గతంలో పెట్టిన బోర్డు

ప్రజాశక్తి-తాడేపల్లి

మంగళగిరి-తాడేపల్లి పాత జాతీయ రహదారి పక్కన ఇండియన్ ఆయిల్ సమీపలో రోడ్డు పక్కనే ఉన్న ప్రభుత్వ స్థలానికి బాలారిష్టాలు ఎదురవుతున్నాయి. పాత ఐఒసి కంపెనీకి ఆనుకుని పెద్ద కొండ ఉండేది. ఈ కొండను ప్రభుత్వం విశ్రాంత మిలటరీ ఉద్యోగికి సుమారు 20 ఏళ్ల క్రితమే ఇచ్చింది. సుమారు ఎకరానికి పైగా ఉండే ఈ స్థలాన్ని (కొండ ఉండటంతో) మిలటరీ ఉద్యోగి పట్టించుకోలేదు. పదేళ్ల క్రితం అమరావతి రాజధాని అయిన నేపథ్యంలో కొండలు, గుట్టలకు ఎక్కలేని ధరలు పెరిగాయి. ఉద్యోగి తన స్థలం చూసుకుందామని వచ్చే సరికి అప్పటి తాడేపల్లి పురపాలక సంఘం ఆధ్వర్యంలో వాటర్ ట్యాంకు నిర్మించాలని ప్రతిపాదించారు. ఆ మేరకు కొండను మొత్తం చదును చేశారు. దీనిపై మిలటరీ ఉద్యోగి కోర్టుకెళ్లగా స్టే విధించింది. మున్సిపల్ అధికారులు తాగునీటి పైలెట్ ప్రాజెక్టు కోసం ఈ స్థలాన్ని కేటాయించాలని నిర్ణయించారు. డిపిఆర్ కోసం రూ.50 లక్షలు అప్పట్లోనే ఖర్చు చేశారు. అప్పుడే ఈ స్థలం తాడేపల్లికి పురపాలక సంఘానికి చెందినదని బోర్డు కూడ ఏర్పాటు చేశారు.

అప్పట్లో మున్సిపాలిటీలో వైసిపి, రాష్ట్రంలో టిడిపి అధికారంలో ఉండటంతో ఆ పథకం ముందుకు సాగలేదు. తరువాత రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. పైలెట్ ప్రాజెక్టు నిర్మిద్దామనుకున్న స్థలాన్ని బాబూజగ్జీవన్‌రామ్ చర్మకార భవనం పేరుతో 10 గదులు నిర్మించాలని మున్సిపాలిటీ తీర్మానించింది. ఆ మేరకు స్థానిక ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, లీడ్ క్యాప్ చైర్మన్ కాకుమాను రాజశేఖర్, మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు భవన సముదాయానికి 2022లో శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. 15వ ఫైనాన్స్ గ్రాంట్ కింద రూ.57.50 లక్షలతో నిర్మాణం పూర్తి చేశారు. చర్మకారులు తమ వృత్తి చేసుకునేందుకు ఈ గదులు కేటాయించాలని నిర్ణయించారు. మంగళగిరి 5, తాడేపల్లికి 5 చొప్పున కేటాయింపులు కూడా జరిగాయి. నాలుగు రోజుల క్రితం విశ్రాంత మిలటరీ ఉద్యోగికి అనుకూలంగా కోర్టు స్టే విధించింది. నిర్మాణం పూర్తయినా వృత్తిదారులకు ఈ గదులు దక్కలేదు. మొదటి నుంచి అనేక బాలారిష్టాలు ఎదుర్కొంటున్న ఈ స్థలం మీద పట్టణంలో తీవ్ర చర్చ జరుగుతుంది. దీనిపై మున్సిపల్ అధికారులను కలవడానికి ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.



సమావేశంలో మాట్లాడుతున్న బైరగాని శ్రీనివాసరావు

కౌల్దార్లందరికీ గుర్తింపు కార్డులివ్వాలి

- ప్రత్యేకంగా గ్రామ సభలు నిర్వహించి జారీ చేయాలి
- భూ యజమాని సంతకం నిబంధనను ఎత్తేయాలి : కౌలురైతు సంఘం

ప్రజాశక్తి - దుగ్గిరాల

భూ యజమానితో సంబంధం లేకుండా గ్రామ సభలు నిర్వహించి కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు మండల కేంద్రమైన దుగ్గిరాలలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం విధించిన నిబంధనల వల్ల కౌలురైతులు అందరికీ గుర్తింపు కార్డులు రాలేదని, ప్రస్తుత ప్రభుత్వం స్పందించి రైతులకు ఎల్ఇసి కార్డులు మంజూరు చేయాలని కోరారు. వ్యవసాయంలో అమలు చేస్తున్న పథకాలు, రాయితీలు, సబ్సిడీలను వాస్తవ సాగుదార్లపై కౌలురైతులకే వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికై వ్యవసాయంలో అధిక భాగం భూమిని సాగుకేస్తున్న కౌలురైతులు అనేక కష్టనష్టాలను భరిస్తున్నారని, అయినా వీరికి ప్రభుత్వాల నుండి సరైన సహకారం లేదని, చెప్పారు. ఆత్మహత్యలకు పాల్పడుతున్న వారిలోనూ కౌల్దార్లే అధికమని ఈ నేపథ్యంలో వీరికి ప్రభుత్వం నుండి ప్రత్యేక చర్యలు తీసుకుని ఆత్మహత్యలను నివారించాలని కోరారు. రుణాలు, సబ్సిడీపై ఎరువులు, పురుగు మందులు, యంత్రపరికరాలు అందించాలన్నారు. సంఘం మండల కార్యదర్శి ఎం.నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ భూమి మీద పనిచేసే కౌలు రైతులకు కూడా రూ.20 వేల సాయాన్ని ప్రభుత్వం ఇవ్వాలన్నారు. గత టిడిపి ప్రభుత్వంలో చేపట్టిన హై లెవెల్ ఛానల్ పనులింకా పూర్తవ్వలేదుని, 25 గ్రామాలు, ఐదు మండలాలకు సాగు, తాగునీరందించే ఈ ఛానల్ పనులను సత్వరమే పూర్తి చేయాలని కోరారు. పంట కాల్వలను ఉపాధి హామీ పనుల కింద మరమ్మతులు చేయించాలన్నారు. సమావేశంలో సిహెచ్ పోతురాజు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఫిట్‌నెస్ లేని వాహనాల సీజ్

జిల్లాలో వాహనాలకు ఫిట్ నెస్ ధ్రువపత్రాలు లేకుండా నడిపితే వెంటనే సీజ్ చేస్తామని జిల్లా రవాణా శాఖ అధికారి షేక్ కరీం తెలిపారు. విద్యా సంస్థల వాహలన్నీంటిని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నామని వివరించారు. సురక్షిత డ్రైవింగ్ కోసం ప్రతి రోజు జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రజాశక్తి ప్రతినిధికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలు తెలియజేశారు.



- విద్యా సంస్థల బస్సుల తనిఖీ కొనసాగిస్తాం
- సురక్షిత డ్రైవింగ్‌పై అవగాహన సదస్సులు
- లైసెన్సుల జారీ ప్రక్రియలో మార్పులేదు
- ప్రజాశక్తితో జిల్లా రవాణా అధికారి కరీం



విద్యా సంస్థల బస్సులు తనిఖీలు?

జిల్లాలో మే 15 నాటికి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తీసుకోవాలని అన్ని విద్యా సంస్థల నిర్వాహకులకు తెలియజేశాం. విద్యా సంస్థల ప్రారంభం నాటికి అన్ని బస్సులు ఫిట్‌నెస్ లేకుండా బయటకు వస్తే సీజ్ చేస్తాం. జిల్లా మొత్తం మీద 1400 నుంచి 1500 బస్సుల వరకు ఉన్నాయి. ఇప్పటికీ 150 నుంచి 160 బస్సులకు ఫిట్ నెస్ సర్టిఫికెట్ తీసుకోలేదని మా దృష్టికి వచ్చింది. ఇందుకోసం నిత్యం తనిఖీలు చేస్తున్నాం.

ఇప్పటి వరకు ఎన్ని కేసులు నమోదు చేశారు?

ఇప్పటి వరకు 9 బస్సులను సీజ్ చేశాం. వీరిపై కేసులు నమోదు చేశాం. విద్యా సంస్థల బస్సులు పాటించాల్సిన 32 రకాల నిబంధనలు పాటించని వారిపై 36 కేసులు నమోదు చేశాం. పర్మిట్ కండిషన్ ఉల్లంఘించిన, నిబంధనలు పాటించని వారికి రూ.10 వేలు జరిమానా, లైసెన్సు రద్దు చేస్తాం. 15 ఏళ్లు దాటిన బస్సులను ఎట్టి పరిస్థితుల్లో కూడా నడపకూడదని నిర్దేశించాం.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు?

రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. నిత్యం తమ కార్యాలయానికి వేర్వేరు పనుల మీద 300 నుంచి 400 మంది వరకు ప్రజలు వస్తారు. వీరిని బ్యాచ్‌ల వారీగా గంట సేపు కూర్చొబెట్టి రోడ్డు ప్రమాదాల నివారణకు సేఫ్టీ డ్రైవింగ్ ఎడ్యుకేషన్ సెంటర్‌లో వీడియో, ఆడియో అవగాహన తరగతులు నిర్వహిస్తున్నాం. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్నాం.

డ్రైవింగ్ లైసెన్సుల మంజూరులో మార్పులు వచ్చాయా?

ఎటువంటి మార్పులై లేవు. గతంలో ఉన్న నిబంధనలు యథాతథంగా కొనసాగుతున్నాయి. తమ కార్యాలయానికి రాకుండా ప్రైవేటు సంస్థల ద్వారా లైసెన్సులు జారీ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదు. వాహన సారథి నేషనల్ పోర్టల్ ద్వారా లైసెన్సుల జారీకి దరఖాస్తు మాత్రమే చేసుకోనే అవకాశం ఉంది.

దొంగ వాహనాల నియంత్రణ?

ఇతర రాష్ట్రాల్లో వాహనాలను దొంగిలించి వాహనాలను రిజిస్ట్రేషన్ చేయకుండా పగడ్బందీగా చర్యలు తీసుకుంటున్నాం. అన్ని ధ్రువపత్రాలు ఉంటేనే సంబంధిత వాహనం వివరాలు పూర్తిగా ఇస్తేనే తిరిగి రిజిస్ట్రేషన్‌కు అవకాశం ఉంటుంది. లేదంటే ప్రాథమిక దశలోనే తిరస్కరిస్తాం. ప్రస్తుతం 'వాహన్' అనే వెబ్‌సైట్, ఈ-ప్రగతి ద్వారా రిజిస్ట్రేషన్‌కు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. కానీ దొంగ వాహనాలను గుర్తించేందుకు పలు రకాల నియంత్రణతో పాటు సంబంధిత రాష్ట్రం నుంచి క్లియరెన్సు వస్తేనే అనుమతిస్తాం.

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

నేడు కలెక్టర్ కార్యాలయంలో గ్రీవెన్స్

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో 'ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ' కార్యక్రమాన్ని జిల్లా, డివిజన్, మండల స్థాయిలో నేటి నుండి ప్రతి సోమవారం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయి అధికారులు జిల్లా హెడ్ క్వార్టర్‌లో, డివిజన్ స్థాయి అధికారులు సంబంధిత సబ్ కలెక్టర్ కార్యాలయంలో, మండల స్థాయి అధికారులు తహశీల్దార్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు హాజరు కావాలని, ప్రజలకు అసౌకర్యం లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

నేడు జిఎంసిలో గ్రీవెన్స్

ప్రజాశక్తి-గుంటూరు

ప్రజల నుండి తాగునీటి సరఫరా, వీధి దీపాలు, పారిశుద్యం, వంటి స్థానిక సమస్యలపై అందే ఫిర్యాదులు, అర్జీలు ఫిర్యాదుల స్వీకరణకు జిఎంసి ప్రధాన కార్యాలయంలో నేడు ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్) జరుగుతుందని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పిజిఆర్ఎస్ ప్రతి సోమవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో ఉదయం 10 గంటల నుండి జరుగుతుందని, సదరు కార్యక్రమంలో కమిషనర్‌తోపాటు, నగరపాలక సంస్థ ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్య విభాగాధిపతులు, డిప్యూటీ కమిషనర్లు, అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు. నగర ప్రజలు తమ ప్రాంతాల్లో త్రాగునీటి సరఫరా, వీధి దీపాలు, పారిశుధ్యం వంటి స్థానిక సమస్యలపై పిజిఆర్ఎస్ కార్యక్రమంలో అర్జీలు, ఫిర్యాదులను అందించవచ్చని, వాటిని నిర్దేశిత సమయంలో పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.